తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ళ ప్రస్థానం వార్త వార్షికోత్సవం 1996 - 2026

## కేంద్రమంత్రి మురుగన్‌కు నేతల సన్మానం

తిరుపతి, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:



తిరుచానూరు పద్మావతి అమ్మవారి దర్శనానికి విచ్చేసిన కేంద్ర మంత్రి ఎల్ మురుగన్‌కి బిజెపి నేతలు ఆత్మీయ స్వాగతం పలికారు. బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు గుండాల గోపీనాథ్ రెడ్డి, బిజెపి నాయకులు లోక ప్రభాకర్ నాయుడు, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, కోలా సుబ్రహ్మణ్యం, మిట్టపల్లి బ్రహ్మానందరెడ్డి ,డి ,ఉదయ్ తదితరులు అమ్మవారి దర్శనానంతరం కేంద్ర మంత్రిమురుగన్‌కు చిత్రపటం బహుకరించారు.

## వేడుకగా పద్మావతి శ్రీనివాసుల కల్యాణం

### గజవాహనంపై ఊరేగిన మలయప్ప



తిరుమల, ఏప్రిల్ 25 పభాతవార్త ప్రతినిధి:

శ్రీమహావిష్ణువు కలియుగంలో వేంకటేశ్వరస్వామిగా ఆవిర్భవించిన తొలిరోజుల్లో నారాయణ వనంలోని ఆకాశరాజు కుమార్తె పద్మావతిని వివాహమాడిన ఘట్టం నేటికీ తిరుమల తిరుపతి దేవస్థానమ్ అధికారులు నిర్వహిస్తున్నారు. మూడురోజులుపాటుజరిగే ఈ పరిణయోత్సవాలు శనివారం సాయంత్రం కన్నులపండువగా మొదలయ్యాయి. తొలిరోజు సాయంత్రం మలయప్ప స్వామి గజవాహనంపై ఆలయం నుండి ఊరేగింపుగా నారాయణగిరి ఉద్యానవనాలు చేరుకోగా శ్రీదేవిభూదేవులు పల్లకీపై మంగళవాయిద్యాల నడుమ చేరుకున్నారు. ఉద్యానవనంలోని కల్యాణవేదికపైకి మంగళవాయిద్యాలనడుమ వేంచేపుచేశారు. కల్యాణవేదిక వద్ద ఆలయ అర్చకులు, అధికారులు ప్రత్యేకంగా ఫల,పుష్పాలతో తీర్చిదిద్దిన కల్యాణమండపం వేదికపై స్వామి అమ్మవార్లను కొలువుదీర్చారు. ఆగమోక్తంగా కల్యాణఘట్టాన్ని జరిపించారు. కొలువు,ఎదురుకోలు, పూలబంతులాట ,నూతన వస్త్రాలు ధరింపజేయడం వంటివి అర్చకులు జరిపించడంతో భక్తులు కన్నులపండువగా వీక్షించి ముగ్ధులయ్యారు. అన్నమాచార్యకళాకారులు అలపించిన సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి.అక్కడ నుండి మంగళవాయిద్యాల నడుమ స్వామిఅమ్మవార్లు తిరిగి ఆలయానికి చేరుకున్నారు. పరిణయోత్సవ మండపాన్ని వివిధ రుచుల ఫలాలు, సువాసనలు వెదజల్లే రంగురంగుల పుష్పాలతో అలంకరించి,శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, అర్చకులు, అధికారులు,భక్తులు పాల్గొన్నారు.

## స్తబ్దుగా మారిన రాజకీయాలు

### కూటమి నేతల మధ్య కొరవడిన సమన్వయం



ప్రభాతవార్త-తిరుపతి:

రాజకీయచైతన్యం కలిగిన ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రాజకీయాలు స్తబ్దుగా తయారు అయ్యాయి. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలుగా విడిపోయినప్పటికీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ మంత్రి వైసిపి నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాబల్యం ఉంది. గత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాలలో కూటమికి 120 వైసిపికి రెండు స్థానాలు వచ్చాయి. పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి ( పుంగనూరు) , ఆయన తమ్ముడు ద్వారకానాథ రెడ్డి తంబళ్లపల్లె )ఎమ్మెల్యేలుగా ఆయన కుమారుడు మిథున్ రెడ్డి రాజంపేట లోక్ సభ సభ్యుడుగా ఎన్నికయ్యారు. వైసిపి పాలనలో కె నారాయణ స్వామి ఉపముఖ్యమంత్రిగా, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్ కె రోజా మంత్రులుగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్య మంత్రి చంద్రబాబు జిల్లా నుంచి ఎవరికి మంత్రి పదవి ఇవ్వలేదు. పదవి ఆశించిన పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, పలమనేరు ఎమ్మెల్యే ఎన్ అమరనాథ రెడ్డి నిరాశకు గురయ్యారు. పలువురికి నామినేటెడ్ పదవులు, పార్టీ పదవులు ఇచ్చినా సమర్థ వంతంగా పనిచేయలేక పోతున్నారు. సగం మంది కూటమి ఎమ్మెల్యేలు తమ స్వంత పనులు చక్కపెట్టుకుంటూ కార్యకర్తలను పట్టించుకోవడంలేదు. టిడిపి, జనసేన, బిజెపి నేతల మధ్య సమన్వయం కనిపించడం లేదు. తిరుపతి, చంద్రగిరి నియోజక వర్గాలలో కూటమి పార్టీల మధ్య విభేధాలు కనిపిస్తున్నాయి.వైసిపి నేతలు తమపై ఉన్న అవినీతి కేసులకు భయపడి ప్రజా పోరాటాలు చేయడం లేదు. వైసిపి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి మాత్రం ఉనికి చాటుకొంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ అప్పుడప్పుడు మీడియాలో మాట్లాడు తున్నారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు అనుకున్న స్థాయిలో పనిచేయడంలేదు.

### షార్ తీరప్రాంత భద్రతపై

## ఐజీపి సమీక్ష

### రాయదరువులో నిర్మాణానికి అడుగులు



శ్రీహరికోట, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:

మెరైన్ పోలీస్ ఐజీపి గోపినాథ్ జెట్టి శనివారం శ్రీహరికోట ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు. దేశ రక్షణ రంగంలో అత్యంత కీలకమైన షార్ కేంద్రానికి సమీపంలో ఉన్న తీరప్రాంత భద్రతను మరింత పటిష్టం చేసే లక్ష్యంతో ఈ పర్యటన సాగింది. తొలుత ఆయన శ్రీహరికోట మెరైన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, స్టేషన్ పరిధిలోని సిబ్బంది పనితీరును, పెట్రోలింగ్ విధానాలను అడిగి తెలుసుకున్నారు. తీర ప్రాంతంలో అపరిచిత వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, మత్స్యకారులతో సమన్వయం చేసుకుంటూ భద్రతా వ్యవస్థను బలోపేతం చేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన రాయద రువు ప్రాంతానికి చేరుకుని, అక్కడ నూతనంగా నిర్మించ తలపెట్టిన మెరైన్ జెట్టి నిర్మాణ స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఐజీపి మాట్లాడుతూ.. మెరైన్ పోలీసుల బోట్లు నిలపడానికి, అత్యవసర సమయాల్లో వేగంగా స్పందించడానికి సొంత జెట్టి సౌకర్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ స్థల పరిశీలనలో మత్స్యశాఖ అధికారులతో కలిసి సాంకేతిక అంశాలను చర్చించారు. జెట్టి నిర్మాణం వల్ల అటు పోలీసులకు, ఇటు స్థానిక మత్స్యకారులకు చేకూరే ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక పంపి పనులు త్వరితగతిన ప్రారంభమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, సూళ్లూరుపేట సీఐ ఎం.మురళీకృష్ణ, శ్రీహరికోట ఎస్ఐ భాను, మెరైన్ ఎస్ఐ, భారీ సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. శ్రీహరికోట భద్రత దృష్ట్యా సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు కూడా ఈ పర్యటనలో పాల్గొని, సముద్ర మార్గం ద్వారా ఎదురయ్యే సవాళ్లు మరియు అంతర్గత భద్రతా అంశాలపై ఐజీపితో చర్చించారు. తీరప్రాంత గ్రామాల్లోని ప్రజలకు భద్రతపై అవగాహన కల్పించాలని ఐజీపి ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు.

### గ్రామ శుభ్రతకు

## గ్రీన్ షాప్ ముందడుగు

### -చెర్లోపల్లిలో పైలెట్ ప్రాజెక్టు ప్రారంభం - వ్యర్థాలకు విలువ

తిరుపతిరూరల్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం చెర్లోపల్లి గ్రామ శుభ్రత, పర్యావరణ పరిరక్షణకు చెర్లోపల్లి గ్రామ పంచాయతీ వినూత్న చర్యగా రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద వినూత్నంగా గ్రీన్ షాప్‌ను ప్రారంభించింది. గ్రీన్ షాప్‌ను స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని శనివారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశుభ్రమైన గ్రామాలతో పాటు వ్యర్థాలకు కూడా ఖరీదును కట్టిస్తుందని తెలిపారు. గతంలో స్వచ్ఛరథాలు ఉండేవని, అదేస్థానంలో యువతకు ఉపాధి కల్పిస్తూ గ్రీన్ షాప్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రీన్‌షాప్ ద్వారా గ్రామ ప్రజల నుంచి ప్లాస్టిక్, కాగితం, గాజు లోహం వంటి డ్రై వ్యర్థాలను సేకరించి, వాటికి బదులుగా నిత్యావసర వస్తువులు అందజేయనున్నారు. సేకరించిన వ్యర్థాలను రీ సైక్లింగ్ యూనిట్లకు పంపి, పునర్వినియోగం చేయడం ద్వారా పర్యావరణానికి మేలు చేకూరుతుందని తెలిపారు.

#### ఏ ఏ వ్యర్థాలు స్వీకరిస్తారు

పాత పుస్తకాలు, న్యూస్ పేపర్లు, కార్డ్బోర్డ్ బాక్స్‌లు, ప్లాస్టిక్ బాటిల్స్, గాజు సీసాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు వంటి పదార్థాలను గ్రీన్ షాపులో స్వీకరిస్తారు ఇళ్లలోనే తడి-పొడి వ్యర్థాలను వేరు చేసి గ్రీన్‌షాప్‌కు అందజేయాలని అధికారులు కోరారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని పరిశుభ్రంగా మార్చడం ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. ఇలాంటి గ్రీన్‌షాపులను తిరుపతిరూరల్ మండలంలోని ఇతర ప్రధాన పంచాయతీల్లో కూడా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ సుశీలాదేవి, డిఎల్‌పిఓ సురేష్‌నాయుడు, ఎంపిడిఓ మస్తాన్ వల్లి, పంచాయతీ కార్యదర్శి లోకేష్,తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, టిడిపి సీనియర్ నేత వైకుంఠం శ్రీధర్‌నాయుడు, క్లాస్‌వన్ కాంట్రాక్టర్ బొల్లినేని శుభగిరి నాయుడు మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

### కన్నుల పండువగా

## చిన్నకోటాయ్ ఉత్సవం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 25 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం చిన్న కొటాయ్ ఉత్సవం కన్నుల పండువగా ప్రారంభించారు. శ్రీరామనవమి సందర్భంగా పది రోజుల పాటు పెద్దకొటాయ్ ఉత్సవం నిర్వహించారు. ప్రస్తుతం వేసవి కాలంలో చిన్నకొటాయ్ ఉత్సవం శనివారం ప్రారంభించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవర్లను అలంకార మండపంలో చక్కగా ఆలంకరించారు. భక్తులు స్వామి అమ్మవార్ల శోభను తిలకిస్తుండగా భక్తి శ్రద్ధలతో ఆలయ ఆవరణలో ఊరేగింపు జరిపారు. సాయంత్రం నుంచి ఆలయంలో సందడి చోటు చేసుకుంది. ఆలయ ప్రాకరంలోని పొగడమాను వద్ద చక్కగా ఒట్టివేర్లతో కూడిన సాపలతో ముస్తాబు చేసారు.వాటి మీద నీటిని చల్లగా ఆ చల్లదనాన్ని స్వామి అమ్మవార్లు ఆస్వాదించేటట్లు ఏర్పాటు చేసారు. వేసవి ఎండలు దడపుట్టిస్తున్న సమయంలో స్వామి అమ్మవార్లకు చల్లదనం కోసం వట్టివేర్లతో కూడిన ఏర్పాట్లను చేసారు. పొగడమాను కింద అభిషేకాలు, దూప దీప నైవేద్యం జరిపారు. మే 1న స్వామి అమ్మవార్లను గ్రామోత్సవం నిర్వహించబడుతుందని తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి

పుత్తూరు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త



తిరుపతి - చెన్నై జాతీయ రహదారిపై రోడ్డు దాటు తున్న ఒక వ్యక్తిని శనివారం రాత్రి 8 గంటల సమయంలో ఒక ద్విచక్ర వాహనం గుద్దడంతో ఆ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా వున్నాయి. తడుకు పంచాయతీలోని దళితవాడకు చెందిన నాథముని (46) జాతీయ రహదారిపై శిరుగురాజుపాలెం వద్ద డివైడర్ మీద నుంచి రోడ్డు దాటుతుండగా తిరుపతి నుంచి పుత్తూరు వైపుగా వెళుతున్న ఒక ద్విచక్ర వాహనం అతనిని ఢీకొంది. ప్రమాదంలో తీవ్ర రక్తగాయాలైన నాథమునిని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. వాహనాన్ని సంఘటనా స్థలంలో వదిలేసి ద్విచక్రవాహందారులు పరారయ్యారు. ఎస్ఐ వెంకటలక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కట్టుదిట్టమైన భద్రత -ఆలయం పరిసరాల్లో పూర్తి నిఘా



తిరుమల,ఏప్రిల్ 25ప్రభాతవార్తప్రతినిధి:

రెండురోజుల పర్యటనకు తిరుమల,తిరుపతికి ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ రేపు విచ్చేస్తున్నారు. ఈ సందర్భంగా ముందస్తు భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు సమీక్షి ంచారు. ఉప రాష్ట్రపతి పర్యటనలో చిన్నపాటి లోపాలకు కూడా తావు ఉండరాదరి జిల్లా రెవిన్యూ అధికారి జి. నరసింహులు సూచించారు. ప్రముఖుల పర్యటనకు సంబంధిత అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ స్పెషలిస్ట్ డాక్టర్లను ఏర్పాటు చేయాలని, సేఫ్ రూమ్, అధునాతన లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌లు, అవసరమైన రక్త గ్రూపులు, మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. అగ్నిమాపక శాఖ ఫైర్ ఇంజిన్‌లతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రముఖులకు అందించే ఆహారాన్ని నిబంధనల మేరకు పరీక్షి ంచాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. . ప్రోటోకాల్ అంశాలు, కేటాయించిన విధుల్లో అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ అధికారి నాగబాబు ,అదనపు ఎస్పీలు రవి మనోహరాచారి, శ్రీనివాస రావు, నాగభూషణ రావు, వెంకటరాముడు, శ్రీకాళహస్తి, తిరుపతి ఆర్‌డీఓ లు భాను ప్రకాష్ రెడ్డి, రామ్మోహన్ ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ భూమినాథన్, సీఐఎస్ఎఫ్ అధికారి అనురాగ్ యాదవ్, ఐబీ అధికారి శిరీషా, డీఎస్పీలు కొండయ్య, చంద్రశేఖర్, భక్తవత్సలం, రామకృష్ణ, చిరంజీవి, ప్రసాద్, రాంబాబు, అంకారావు, వెంకటనారాయణ, డీఎఫ్ఓ రమణయ్య, డీఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్, ఆర్ అండ్ బి ఎస్ ఈ రాజా నాయక్, , డీపీఆర్ఓ

### అంతుచిక్కని వ్యాధితో

## పశువుల మృతి



శ్రీకాళహస్తిరూరల్,ఏప్రిల్ 25 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు గ్రామంలో పశుసంపదనుమృత్యువు కబళిస్తున్నట్లు సమాచారం అందింది, అయితే పోస్టుమార్టం జరిపిన పశుసంవర్థక శాఖ డాక్టర్ మాత్రం విషాహారం తిని మృత్యువు పాలౌతున్నట్లు రైతులకు వివరించినట్లు తెలిసింది. వారంలో సుమారు 30 నుంచి 40పశువులు మృతి చెందినట్లు సమాచారం. అయితే ఈ సంంఘటనలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడ విషారం ఉందనేది రైతులకు అంతుపట్టడం లేదు. శ్రీకాళహస్తి మండలంలో ఓ వైపు వ్యవసాయం మరో వైపు పాడి పరిశ్రమతో రైతులు సుభిక్షంగా ఉన్నారు. శ్రీకాళహస్తికి 15కిలోమీటర్ల దూరంలోని ముచ్చివోలు గ్రామం అ తి పెద్ద పంచాయతి. ఇక్కడ గ్రామం చుట్టూ పంట పొలాలే. సమృద్ధిగా వ్యవసాయం సాగుతుంది. అలాగే వందలాది పసుసంపద ఉంది. ఈ గ్రామానికి చెందిన మహిళలు పాడి పరిశ్రమను బాగా అభివృద్ధి చేసుకున్నారు. రెండు రోజుల్లోనే 20కి పైగా పశువులు మృతి చెందినట్లు తెలిసింది. దాంతో పశుసంవర్థక శాఖకు చెందిన డాక్టర్ పోస్టుమార్టం నిర్వహించగా విషాహారం తినటంతో ఇలా జరిగిందని అభిప్రాయపడినట్లు తెలిసింది. ఈ సంఘటన పాడి రైతులను కలచి వేస్తుంది. పాడి పరిశ్రమపై ఆధారపడి పలు కుటుంబాలు జీవిస్తున్నాయి. ఈ సంఘటనతో రైతులు తల్లడిల్లుతు న్నారు. చనిపోయిన పశువులు బ్యాంకు రుణంతో కొనుగోలు చేసుకున్నదని చెబుతున్నారు.

## యాదమరి బోధగుట్టపల్లి గంగిరెడ్డిచెరువు పునర్జీవం

### - జలధార-జలహారతి ఎఫెక్ట్



యాదమరి మండలంలో జలధార-జలహారతి కార్యక్రమంలో చెరువుల పూడికతీత పనులు, ఇన్‌సెట్‌లో ఉపాధి ఎపిఓ సంధ్యారాణి.

చిత్తూరు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:

జిల్లా వ్యాప్తంగా నీటి వనరుల అభివృద్ధిలో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న జలధార-జలహారతి కార్యక్రమం సానుకూల ఫలితాలు ఇస్తోంది. యాదమరి మండలం బోధగుట్టపల్లి గంగిరెడ్డిచెరువులో జలధార-జలహారతి కార్యక్రమంలో చేపట్టిన ఫీడర్ కాలువ పూడికతీత పనులు ఈ పథకం యొక్క విజయగాథ ప్రపంచానికి తెలియజేస్తోంది. యాదమరి మండల పరిధిలో మొత్తం 59 చెరువుల పరిధిలో 533 కిమీమీటర్ల పరిధిలో 177 కాలువలు వున్నాయి. చెరువులు, కాలువల్లో పూడిక తీయడానికి జలధార-జలహారతి కార్యక్రమం ప్రారంభం కావడంతో మండల ఉపాధి ఎపిఓ సంధ్యారాణి కాలువల్లో పూడిక తీయడానికి చకచకా ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించారు. ఈ మేరకు మండల పరిధిలో మొత్తం 533 కిమీ పరిధిలో కాలువలు వుండగా ఇందులో 354 కిమీ పొడవు పూడిక తీయడానికి అనుమతులు మంజూరు కావడంతో మండల పరిధిలో జలధార-జలహారతి పనులు చకాచకా ప్రారంభించారు. మండల పరిధిలో సుమారు 1,280 మంది ఉపాధి కూలీలు శ్రమించి ప్రతి చెరువును రానున్న వర్షాకాలంలోపు త్వరితంగా పనులు పూర్తి చేసి ప్రతి కాలువను శుద్ధి చేసి ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసి పట్టేలా ఆయకట్టులో వున్న ప్రతి రైతు పొలంలోని బావి లేదా బోరు రీచార్జ్ అయ్యే విధంగా పనులు చేపడుతున్నారు. అలాగే కొన్ని కాలువల్లో మనుషులు చేయలేని పనులను యంత్రాలు వాడి ప్రతి అడుగు కాలువను శుద్ధి చేసి ప్రతి చెరువుకు నీరు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎపిఓ సంధ్యారాణి పేర్కొన్నారు. జలధార-జలహారతి కార్యక్రమం పనులకు సంబంధించి ప్రతి అనుమతి యుద్ధప్రాతిపదికన కలెక్టర్ సుమిత్‌కుమార్, డ్వామా పిడి రవికుమార్‌లు అనుమతులు మంజూరు చేస్తున్నారని ఆమె తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జలధార-జలహారతి కార్యక్రమం యాదమరి మండలంలో విజయవంతంగా జరుగుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో బోధగుట్టపల్లి పంచాయతీ పరిధిలోని కొలనాంపల్లి హరిజనవాడలో గ్రామస్తులు కలిసి చేపట్టిన పనులు మంచి ఫలితాలు ఇస్తున్నాయన్నారు. ఇక్కడ వర్షపు నీరు కాలువల ద్వారా వెళ్ళిపోతూ కుంట వద్ద నిల్వ వుండకపోవడం ప్రధాన సమస్యగా వుండేదన్నారు. అదే గ్రామానికి చెందిన బి.అనిత మాట్లాడుతూ మా ప్రాంతంలో వర్షం కురిస్తే వర్షపు నీరు నిల్వ వుండటం లేదు. ఎలాగైనా కుంటలో వర్షపు నీరు నిల్వ వుండేలా చేయాలని నిర్ణయించిన గ్రామస్తులు కుంటలో పూడిపోయిన మట్టిని తీసి పైభాగంలో వేస్తూ నీరు అక్కడే నిలిచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇక్కడ నిల్వ వుండే నీరు పొలం సాగు పనులకు ఉపయోగపడుతుందన్నారు. అలాగే మండల పరిధిలోని పెరగండ్లపల్లి గ్రామంలో చెరువు పూడికతీత పనులు వేగంగా సాగుతున్నాయి. చెరువులో వర్షపు నీరు నిల్వ వుండాలంటే చెరువులో పూడిపోయిన మట్టిన తొలగించాలని నిర్ణయించిన గ్రామస్తులు ఆ మేరకు ఉపక్రమించి పెద్ద ఎత్తున పనులు చేపట్టారు. ఈ పనుల ద్వారా చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు కాలువల ద్వారా నీటి ప్రవాహం సాఫీగా సాగుతుంది.

# రైతు సంక్షేమమే లక్ష్యం

## - ఆధునీకరించిన భూసార పరీక్షా కేంద్రంను ప్రారంభించిన ఎమ్మెల్యే



చిత్తూరు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:
రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పేర్కొన్నారు.

కట్టమంచి వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ఆధునీకరించిన భూసార పరీక్షా కేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, భూసార పరీక్షా కేంద్రాల నిర్వహణను గాలికి వదలివేసిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే రైతులకు ఉపయోగకరమైన భూసార పరీక్షా కేంద్రానికి రూ.16 లక్షలు మంజూరు చేసి ఆధునీకరించి రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. రైతుల తమ పొలాల్లో మట్టిని పరీక్షించి ఏఏ పంటలు పండించడానికి అనువుగా వుంటుందో ముందస్తుగా గుర్తించి ఆ పంటలు సాగు చేసి రైతులు లాభాలు ఆర్జించాలన్నారు. భూసార పరీక్షా కేంద్రాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గురజాల పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురజాల రైతులకు నవధాన్యాల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఝాన్సీ వెంకటేష్ యాదవ్, వైస్ ఛైర్మన్ అనురాధ, వ్యవసాయ శాఖ జెడి మురళీకృష్ణ, ఎడిలు వాసు, ఉమలు, ఎఓలు వేణుగోపాల్, భాషాలు, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇందుమతి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజన్, మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, మాజీ మేయర్ అముద, కమిటీ సభ్యులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బదిలీ అయిన టీచర్లు సత్వరం రిలీవ్



### రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్

**చిత్తూరుహెల్త్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యాశాఖ గత ఏడాది చేపట్టిన బదిలీల ప్రక్రియలో బదిలీ అయిన టీచర్లను సత్వరం రిలీవ్ చేయాలని రాష్ట్ర వైఎస్ఆర్‌టిఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బదిలీ చట్టం తీసుకువచ్చిన కూటమి ప్రభుత్వం విద్యా సంవత్సరం పూర్తయినా రిలీవర్లు లేదన్న సాకుతో 954 మంది ఉపాధ్యాయులను పాత స్థానాల్లోనే విధులు నిర్వర్తించేలా చేయడం దారుణమన్నారు. బదిలీ కాబడిన ఉపాధ్యాయుల కుటుంబాలు ఎక్కడ నివాసం వుండాలో తెలియక సందిగ్దంలో వున్నారని తెలిపారు. బదిలీ చట్టం తీసుకువచ్చిన విద్యాశాఖ మంత్రి ప్రత్యేకచొరవచేసిఉపాధ్యాయులనురిలీవ్ చేయడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని ఆయన కోరారు.

## పేదరిక నిర్మూలనకే బంగారు కుటుంబాల ఎంపిక



**గుడుపల్లె, ఏప్రిల్ 25 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబు నాయుడు పేదరిక నిర్మూలనకే పి4కార్యక్రమం చేపట్టి బంగారు కుటుంబాలను ఎంపిక చేసారని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల కార్యాలయంలో సిఆర్‌పిల సమావేశంకు ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం హాజర య్యారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడా రు. గుడుపల్లె మండలంను సిఎం చంద్రబాబునాయుడు సూచన మేరకు టివిఎస్ కంపెనీ దత్తత తీసు కుందని మండల అభివృద్ధికి బంగారు కుటుంబాల అభ్యున్నతికి సంస్థ కృషి చేస్తోందన్నారు. టివిఎస్ సంస్థ ద్వారా గుడుపల్లెలో 107బంగారు కుటుంబాలకు జీవనోపాధి అవకాశాలు కల్పించడం జరిగింద న్నారు. పి4 కార్యక్రమంను మండలంలో మరింత సమర్థవంతంగా అమలయ్యేలా అర్హులైన పేదలకు ఇతో ధిక సాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ బాబు, టిడిపి మండల అధ్యక్షుడు సుబ్బు, సిల్క్ బోర్డు సభ్యుడు హేమాంబర గౌడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ బేటప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆరిమానుపెంటలో పంటలపై ఏనుగుల బీభత్సం



**రామకుప్పం,ఏప్రిల్ 25 ప్రభాతవార్త** మండలంలోని ఆరిమానుపెంట లో రైతుల పండి స్తున్న పంటలపై ఏనుగులు దాడి చేసి బీభత్సం సృష్టించాయి. శుక్రవారం రాత్రి గ్రామ సమీపంలో ఉన్న కదిరప్ప, ఎర్రప్ప, వెంకటేశు, సంపంగి, రంగప్ప లకు చెందిన వరి, సుబ్రహ్మణ్యం చెందిన అరటి పంటలను తిన్నంత తిని తొక్కి చిందర వందర చేశాయి. అటవీ అధికారులు ఏనుగుల జాడతో అప్రమత్తమై పంటలు అధిక నష్టం జరగకుండా టపాకాయలు పేల్చి అటవీ ప్రాంతంలోకి మళ్ళించారు. తమిళనాడు నుంచి ఏనుగుల పంపు పంటలపై చొరబడి రైతులకు అపార నష్టం కలిగిస్తున్నాయి. గత వారం రోజుల క్రితం నుంచి అటవీ సరిహద్దు గ్రామ ప్రజలకు ఏనుగుల అలజడితో భయాందోళనకు గురయ్యారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని ఏనుగులకట్టడికిశాశ్వతపరిష్కారంచూపాలని,పంటనష్టపరిహారాన్నిఇవ్వాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

## ప్రపంచ మలేరియా దినోత్సవం ర్యాలీ

**రామకుప్పం, ఏప్రిల్ 25 ప్రభాతవార్త** ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని విజలాపురం ప్రాథమిక ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం మండలంలోని భూమండ్లపురం గ్రామంలో మలేరియా వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించి ర్యాలీ చేపట్టారు. దోమల నియంత్రణతో మలేరియా వ్యాధులు దూరమవుతుందన్నారు. ఇంటి పరిసరాల్లో పరిశుభ్రంగా ఉంచుకొని వ్యక్తిగత పరిశుభ్రం ఎంతో అవసరమన్నారు. సాధారణ పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచిత మందులు పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ బాలు, ప్రమీల, రాధా, సుకన్య ,గ్లోరీ, అశ్విని, ఆశ ,వర్కర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రేపటినుంచి శ్రీ సోమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు..





**పెద్దపంజాణి ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** మండలంలోని చలమంగళం గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్నపార్వతీదేవి సమేత శ్రీ సోమేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు ఈ నెల27వ తేదీనుంచి ఘనంగా జరుగుతాయని గ్రామస్థులు తెలిపారు. 27,28వ తేదీ సోమవారం గణపతి పూజా, పుణ్యహావాచనం, అంకురార్పణ, ధ్వజారోహణం, వంచామృత అభిషేకం జరుగుతాయన్నారు. 30వతేదీ స్వామివారి కళ్యాణోత్సవం,మే1వతేదీ స్వామివారి రథోత్సవం, 2వతేదీ దోపోత్సవం జరుగుతాయన్నారు. 3వతేదీ వసంతోత్సవం,ధ్వజారోహణ కార్యక్రమంతోపాటు శయనోత్సవం జరుగుతాయన్నారు.దీంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు.ప్రతిరోజూ రాత్రి ఆలయంవద్ద అన్నదాన జరుగుతుందన్నారు.భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

## పలమనేరు పరిరక్షణ సమితి వితరణ

పలమనేరు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:



పలమనేరు పరిరక్షణ సమితి తన వితరణ చాటుకుంది. శనివారం పలమనేరు రూరల్ మండలం సముద్రపల్లెకు చెందిన ఎస్సీ కులస్తుడు వై,రామాంజనేయులుకు ఇంటి సరుకులు అందజేశారు. సమితి అధ్యక్షుడు నరసింహులు, కార్యదర్శి నారాయణ తదితరులు సముద్రపల్లెకు వెళ్ళి సుమారు రూ.5 వేల విలువైన సరుకులు అందజేశారు. రామాంజనేయులు గతంలో జరిగి ప్రమాదంలో రెండు కాళ్ళు పోగొట్టుకొని అవిటివాడుగా జీవనం సాగిస్తున్నాడు. భార్య పిల్లలు ఉన్న ఇతని దీన స్థితిని గుర్తించి ఎంతో మంది దాతలు విరాళాలు, నిత్యావసర సరుకులు అందజేశారు.

## కుంభాభిషేకాన్ని విజయవంతం చేయండి

గుడిపాల, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:

మండలంలోని పాపసముద్రం గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ శ్రీవినాయక స్వామి దేవస్థానంలో స్వామి వారికి ఆదివారం మహా కుంభాభిషేక నిర్వహించడం జరుగుతుందని, అదేవిధంగా రాగి చెట్టుకు వేప చెట్టుకు వివాహం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరుగుతుందని, అదేవిధంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని గ్రామస్తులు కోరారు.

## విజలాపురానికి రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ మంజూరు

**కుప్పం, ఏప్రిల్ 25 ప్రభాతవార్త** రామకుప్పం మండలం విజలాపురంకు సాంఘీక సంక్షేమ ప్రభుత్వ బాలుర రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈమేరకు సాంఘీక సంక్షేమ శాఖ అకడమిక్ జాయింట్ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ డిగ్రీ కళాశాలలో మొత్తం 80సీట్లను కేటాయించారు. బిఎస్సీ (సిబిజడ్), బికామ్ కోర్సులను ప్రారంభించనున్నారు.

## మంత్రి సవితను కలసిన ఎంఎంసి ఛైర్మన్ జిఎం రాజు



**కుప్పం, ఏప్రిల్ 25 ప్రభాతవార్త** రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితను కుప్పం ఎఎంసి ఛైర్మన్, రాష్ట్ర వన్నియకులక్షత్రియ సాధికార సమితి కన్వీనర్ జిఎం రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం విజయవాడ జయభేరి అపార్ట్‌మెంట్‌లో సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నిర్వహించిన బిసి రాష్ట్ర సాధికార సమితి కన్వీనర్ల సమావేశంకు ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల వారిని ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో పైకి తేవాల్సి ఉందని, తెదేపాకు వెన్నముక అయిన బిసిలకు అన్ని విధాలా ప్రాధాన్యత ఇస్తామని చెప్పారన్నారు. ఇందుకు తగిన కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి సవిత ఎఎంసి ఛైర్మన్ జిఎంరాజుతో సహా ఇతర కన్వీనర్లను ఘనంగా సత్కరించారు.

## ప్రశాంతంగా పాలిసెట్ 2026 ప్రవేశ పరీక్ష



**కుప్పం, ఏప్రిల్ 25 ప్రభాతవార్త** పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహించే పాలిసెట్ -2026 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. కుప్పం బాలుర, బాలికల హైస్కూళ్లు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్‌లలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. మొత్తం 691మందికి గాను 618మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కాగా 73 మంది గైర్హాజరయ్యారు. ఉదయం 11గంటలనుంచి మధ్యాహ్నాం 1గంట దాకా పరీక్ష జరిగింది. పరీక్షల నిర్వహణను కో ఆర్డినేటర్ రామకృష్ణరావు పర్యవేక్షించారు. పరీక్షా పత్రాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## నేడు జనగణనపై 5కె రన్

**చిత్తూరుహెల్త్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** జగ గణన, స్వీయ గణనపై ప్రజల్లో చైతన్యం కల్పించడానికి ఆదివారం ఉదయం 7 గంటలకు 5కె రన్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ ఓ ప్రటకనలో తెలిపారు. నగరంలోని గాంధీ సర్కిల్ నుండి పివికెఎన్ డిగ్రీ కళాశాల వైపుగా ఈ 5కె రన్ కొనసాగుతుందన్నారు. జనగణన-2027లొ భాగంగా ఈ నెల 16వ తేదీ నుండి 30వ తేదీ వరకు జరుగుతున్న స్వీయ గణనపై ప్రజల్లో అవగాహన పెంచడం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఈ కార్యక్రమంలో ప్రజలందరు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## రేపు నింద్రలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**చిత్తూరు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నింద్ర మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నింద్ర ఎంపిడిఓ కార్యాలయంలో ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నాం 2 గంటల వరకు నిర్వహించనున్నారు.

## ప్రభుత్వ బడుల్లోనే పిల్లలు

### - ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు



**చిత్తూరు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పిలుపు నిచ్చారు. చిత్తూరు చామంతిపురంలో శని వారం విద్యాశాఖ ఆధ్వర్యంలో 2026-27 బడి పిలుస్తోంది క్యాంపెనింగ్ డ్రైవ్ కార్యక్ర మంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే గురజాల ఇంటింటికి వెళ్ళి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే పిల్లలతో మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందన్నారు. సిఎం నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఇంట్లో ఎంత మంది పిల్లలు వుంటే అంతమంది పిల్లలకు తల్లికి వందనం డబ్బులు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిల్లలకు మిఠాయిలు పంచుతూ విద్యాశాఖ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ వెంకటరమణ, మండల విద్యాశాఖ అధికారులు సెల్వరాజ్, మోహన్‌లు, మాజీ డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కూటమి నాయకులు ఇందు, నరేష్, అట్లూరి శ్రీనివాసులు, దయానంద్, వరలక్ష్మీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

## - ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్




కుప్పం, ఏప్రిల్ 25 ప్రభాతవార్త

గ్రామాల్లో వేసవి దృష్ట్యా ఎక్కడా మంచినీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ఆదేశించారు. శనివారం కడ సమావేశ మందిరంలో కుప్పం మండల పంచాయతీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు గ్రామాల్లో సమస్యలపై అధికారులు దృష్టి సారించి వాటిని పరిష్కరించాలని సూచించారు. ఇందుకు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం కూడా తీసుకోవాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తితే వెంటనే తమ దృష్టికి తేవాలని సమస్య పరిష్కారంకు కడ, ఇతర నిధులను యుద్ధప్రాతిపదికన కేటాయించడం జరుగుతుందన్నారు. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోందన్నారు. సమావేశంలో ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, తహశీల్దార్ చిట్టిబాబు, కార్పోరేషన్ డైరెక్టర్లు చెక్కునత్తం మణి, శరవణ, కడ సభ్యులు రామచంద్ర, వెంకీ, పిఏసిఎస్ ఛైర్మన్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## ఎమ్మెల్యే ప్రారంభించిన శిలాఫలకం ధ్వంసం

### టిడిపి నేతలు ఆగ్రహం

వి.కోట, ఏప్రిల్ 25 ప్రభాతవార్త



ఇటీవల పలమనేరు శాసనసభ్యుడు అమరనాథ్‌రెడ్డి వి.కోట మండలంలో నిర్వహించిన మీ ఊరికి మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో ప్రారంభించిన అభివృద్ధి శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో టిడిపి నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని బైరుపల్లి పంచాయితీ యాదకుంట నుండి పెదరాంపల్లికి వెళ్లే రహదారికి ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయడంతో సిమెంట్ రోడ్డు వేశారు. గతవారం ఎమ్మెల్యే వి.కోట మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. అందులో భాగంగా యాదకుంట నుండి పెదరాంపల్లికి వేసిన సిమెంట్ రోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభించారు. గుర్తు తెలియని వ్యక్తులు అభివృద్ధి శిలాఫలకాన్ని శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న తెలుగుదేశం నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్ముంటే అభివృద్ధిలో పోటీపడాలి కానీ ఇలాంటి విధ్వం సాలతో కాదని వారు ఘాటుగా విమర్శించారు. ఇటువంటి చర్యలు మండలంలో ప్రశాంత వాతావరణానికి విఘాతం కలిగిస్తుందని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు రాంబాబు ఓ ప్రకటనలో తెలిపారు.

## అనాధ వ్యక్తికి మాజీ సర్పంచ్ ద్వారా అంత్యక్రియలు

కుప్పం, ఏప్రిల్ 25 ప్రభాతవార్త



మూడు రోజుల క్రితం మల్లానూరు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ను రైల్వే పోలీసులు గుర్తించారు .ఈ సంఘటనపై విచారణ ప్రారంభించిన రైల్వే పోలీసులు స్థానికంగా అన్ని కోణాల్లో పరిశీలించినప్పటికీ, మృతుడి వివరాలు మూడు రోజుల పాటు ఎక్కడా లభించ లేదు. ఎవరూ ముందుకు రాకపోవడంతో, ఈ విషయాన్ని రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ శివ, రమేష్ డికెపల్లి మాజీ సర్పంచ్ మణి కి సమాచారం అందించారు. తన స్వంత ఖర్చులతో ఆ అనాధ వ్యక్తికి అంత్యక్రియల ను మాజీ సర్పంచ్ మణి నిర్వహించారు. గతంలో కూడా అనాధ మృతదేహాలకు తన సొంత డబ్బులతో అంత్యక్రియలు నిర్వహించిన వ్యక్తిగా మణి కి ప్రత్యేక గుర్తింపు ఉంది.

## ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రశంసాపత్రం, షీల్డ్ అందుకొన్న చందు

చిత్తూరురూరల్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:



మై టిడిపి యాప్ ద్వారా చిత్తూరు నియోజకవర్గంలో చురుగ్గా పనిచేస్తూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్న తెలుగుదేశం పార్టీ సీనియర్‌నాయకులు, మాజీ టౌన్ బ్యాంక్ ఛైర్మెన్ పి షణ్ముగం కుమారుడు 40, 41 డివిజన్ల యూనిట్ ఇన్‌ఛార్జీ పిఎస్ చందు నివాసానికి తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయం నుంచి ప్రశంసా పత్రం, టిడిపిలోగోతో కూడిన టోపిని పంపడం జరిగింది. ఈనేపథ్యంలో శనివారం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పార్టీ పంపిన షీల్డ్, టోపిని చందుకు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చందు తనకు ఈ గౌరవం అందించిన నారాలోకేష్, తనను ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తున్న చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు అహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

### - ఉమ్మడి చిత్తూరుజిల్లా గ్రంధాలయ ఛైర్మెన్ రెడ్డివారి గురవారెడ్డి

చిత్తూరురూరల్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో విద్యాశాఖమంత్రి నారాలోకేష్ సారథ్యంలో వేసవి విజ్ఞాన శిబిరాలను ప్రతిష్టాత్మకంగా ఈనెల 28వ తేది నుంచి జూన్ 6వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి చిత్తూరుజిల్లా గ్రంధాలయ ఛైర్మెన్ రెడ్డివారి గురవారెడ్డి తెలిపారు. శనివారం జిల్లా గ్రంధాలయంలో ఛైర్మెన్, జిల్లావిద్యాశాఖాదికారి రాజేంద్రప్రసాద్‌తో కలసి విలేకరుల సమావేశం ఏర్పాటుచేసారు. ఈ క్యాంపులు విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభ సృజనాత్మకత, శారీరక మానసిక వికాసానికి ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు పుస్తకపఠనం అలవాటు చేసుకొని జ్ఞానాన్ని పెంచుకోవాలని కోరారు. అదేవిధంగా కంప్యూటర్ ప్రాథమిక శఇక్షణ, కంప్యూటర్ టైపింగ్, ఇంటర్నెట్ వినియోగంపై శిక్షణ ఇస్తారన్నారు. అనంతరం క్యాంపులో నేర్చుకున్న నైపుణ్యాలను ప్రదర్శించుట, ప్రోత్సాహక బహుమతులు కూడా అందిస్తామన్నారు. అలాగే జిల్లా విద్యాశాఖాదికారి మాట్లాడుతూ ఈ సమ్మర్ క్యాంపులకు జిల్లాలో వున్నటువంటి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పూర్తి సహకారం అందిస్తారన్నారు. అనంతరం వేసవి విజ్ఞాన శిబిరాల 2026 బ్రోచర్‌ను అధికారులు, సిబ్బంది, పాఠకులతో కలసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ ఛైర్మెన్,జిల్లా విద్యాశాఖాదికారితో పాటు గ్రంధాలయసంస్థ కార్యదర్శి శర్మ, డిప్యూటీ లైబ్రేరియన్ లావణ్య, గ్రంధాలయ సిబ్బంది, పాఠకులు, పోటీ పరీక్షలు సిద్ధమవుతున్న విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గుడిపాల పిపెచ్‌సిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆకస్మిక తనిఖీ



గుడిపాల, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:

గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శశి భూషణ్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు రికార్డులను పరిశీలించి ప్రజలకు వైద్య సేవలు అందించడంపై ఆరా తీశారు ఎండ తీవ్రతలు ఎక్కువగా ఉన్నందున ప్రజలకు హిట్ స్ట్రోక్ మీద అవగాహన కల్పిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని దానికి తగిన విధంగా క్షేత్రస్థాయిలో ఆశాలు ఏఎన్ఎం లకు సూచనలు ఇవ్వాలని మెడికల్ ఆఫీసర్ సంధ్యను ఆదేశించారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు కాన్పుల శాతం పెంచాలని ఎల్లప్పుడు వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని తెలిపారు కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్‌డాక్టర్ సంధ్య డాక్టర్ చంద్ర మహేష్ సిబ్బంది పవిత్ర వనజ సూర్యనారాయణ త్రిలోక్ పాల్గొన్నారు

## కూటమి ప్రభుత్వంలో మహిళల అభివృద్ధికి పెద్దపీట

గుడిపాల, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:



రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో మహిళల అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెద్దపేట వేస్తున్నారని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు శనివారం చిత్తూరు నందుగల ప్రజాదర్బార్లో గుడిపాల మండల వెలుగు సంఘ మిత్రలతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా సంఘ మిత్రులు పని చేయాలని పిలుపునిచ్చారు అనంతరం ప్రతి ఒక్కరితో మాట్లాడి వారి పంచాయతీ పరిధిలో గ్రామాల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదగడానికి కృషి చేయాలన్నారు అదేవిధంగా ప్రభుత్వ అందిస్తున్న వివిధ రకాల రుణాలను మహిళలకు విరివిగా అందించి ఆర్థిక స్థితి మెరుగుపడేలా తోడ్పడాలని తెలిపారు కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు గుడిపాల ఎంపీపీ గొల్ల హరిప్రసాద్ మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజన్ వెలుగు ఏటీఎం సుధారాణి మండల నాయకులు హేమాద్రి నాయుడు శరత్ బాబు రవి నాయుడు తదితరులు పాల్గొన్నారు

# తిరుపతి డివిజన్

## ప్రకృతి వ్యవసాయంపై ప్రయోగాత్మక శిక్షణ

చంద్రగిరి, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:




ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ప్రోత్స హించడానికి వ్యవసాయ, ఉద్యానవన శాఖల సిబ్బందికి రెండు రోజుల ప్రయోగాత్మక శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి విజయభాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగులో రసాయనిక ఎరువుల వినియోగాన్ని నియంత్రించి సేంద్రీయ ఎరువుల వినియోగం వైపు రైతులను మళ్ళించడమే లక్ష్యంగా ఈ శిక్షణ అందించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం చిన్నరామాపురం, కందులవారిపల్లి, నారావారిపల్లి గ్రామాలలో ఏటిఎం విధానంలో పంటను విత్తే విధానాన్ని ప్రయోగాత్మకంగా సిబ్బందిచే విత్తే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. భూ ఆరోగ్యాన్ని పెంపొందించడంలో జీవామృతం, ఘన జీవామృతం, దశపత్ర కషాయాలను స్వయంగా తయారు చేయడంపై ప్రయో గాత్మకంగా సిబ్బందికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. స్వర్ణ చంద్రగిరి కార్యక్రమంపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు, ప్రకృతి వ్యవసాయ డిపిఎం షణ్ముగం, ఉద్యానవన మండల అధికారి ఎస్.శైలజ, ఏఈఓలు అమీర్, ప్రజ్ఞ, చంద్రగిరి వీఎఎ ఈశ్వరి, జడ్బీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పాలీసెట్ పరీక్ష

### జిల్లా వ్యాప్తంగా 92.33శాతం హాజరు

### 17 సెంటర్లలో పరీక్షకు హాజరైన 4794మంది విద్యార్థులు

తిరుపతి విద్య, ఏప్రిల్ 25 ప్రభాతవార్త



జిల్లా వ్యాప్తంగా పాలిసెట్2026 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో ఏర్పాటు చేసిన 17 పరీక్షా కేంద్రాలలో శనివారం జరిగిన పాలిసెట్ పరీక్షకు 92.33శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. జిల్లాలో 5192 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 4794మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఇందులో బాలురు 3056, బాలికలు 1738 మంది ఉన్నారు. ఉదయం 11గంటలకు ప్రారంభమైన పరీక్షకు సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు తమ తల్లిదండ్రులతో సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవడంలో దాదాపు సఫలమయ్యారు. మూడు ప్రత్యేక ఫ్లైయింగ్ స్క్వాడ్లతో అధికారులు పరీక్షా కేంద్రాలను జల్లెడపట్టారు.

**కాస్త ఇబ్బంది పడినా....!**

ఎస్వీడబ్ల్యూ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు విద్యార్థులు కాస్త ఇబ్బంది పడ్డారు. పరీక్షా కేంద్రానికి చేరుకునే క్రమంలో ఎస్వీడబ్ల్యూ డిగ్రీ కళాశాల వద్దగల రైల్వేగేటు వద్ద ఒక సారిగి ట్రాఫిక్ జామ్ కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వెంటనే స్పందించిన పోలీసులు ఆగమేఘాల మీద అక్కడకు చేరుకుని ట్రాఫిక్ ను క్లియర్ చేసి విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు మార్గం సుగుమం చేశారు. దీంతో విద్యార్థులు, అటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

**స్థాయికి మించి కెమిస్ట్రీ ప్రశ్నలు**

పాలీసెట్ ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థులు పరీక్ష కేంద్రాల నుంచి బయటకు వచ్చి వార్త తో మాట్లాడుతూ... మాథ్స్ ప్రశ్నలు మాదిరిగా వచ్చాయని, ఫిజిక్స్ సైతం పరవాలేదని పించిందని తెలిపారు. కానీ కెమిస్ట్రీ ప్రశ్నలు ఎంసెట్ పరీక్షను తలపించేలా సంధించారని ఆ స్థాయిలో ప్రశ్నలు అడగడంతో ఇబ్బంది పడ్డామని తెలిపారు. అలాగే కొన్ని ప్రశ్నలకు ఇచ్చిన మల్టిపుల్ ఛాయిస్ సమాధానాల విషయంలో కాస్త తికమక పడ్డామని తెలిపారు. సాధారణ విద్యార్థికి కెమిస్ట్రీ ఇబ్బంది పెట్టిందని, మిగిలిన సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు మాధిరిగా ఉన్నాయని ఆ సబ్జెక్టులకు చెందిన అధ్యాపకులు అభిప్రాయపడ్డారు.

## రెక్టార్‌పై ఆరోపణలు దారుణం

తిరుపతి విద్య, ఏప్రిల్ 25 ప్రభాతవార్త



ఎస్వీయూ రెక్టార్‌పై లైంగిక వేధింపులు అంటూ వస్తున్న ఆరోపణలు అవాస్తవమని ఏఐఎస్ఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందని నాయకులు తెలిపారు. ఈ మేరకు శనివారం వీసీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు చిన్న, వర్సిటీ అధ్యక్షకార్యదర్శులు రవియాదవ్, వెంకటేష్ మాట్లాడుతూ రెక్టార్ ప్రొఫెసర్ అప్పారావు గతంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపల్గా, ఎస్వీయూ ఇంచార్జి వీసీగా విధులు నిర్వర్తించారని ప్రస్తుతం రెక్టార్గా కొనసాగుతున్నారని చెప్పారు. అకడమిక్ విద్యకు సంబంధించిన సమస్యలు ఉంటే చర్చించుకోవాలి తప్ప నిరాధారమైన లైంగిక వేధింపుల అంటూ ఆరోపించడం సబబు కాదన్నారు. వర్సిటీ అధికారులు ఈనెల 20వ తేదీన రెక్టార్పై విచారణ పేరుతో విడుదల చేసిన ఉత్తర్వులలో క్యాష్ అండ్ సీజీ విచారణ అంటూ పేర్కొనడం దారుణమని, క్యాష్ అనే పదాన్ని తొలగించి కంప్లైంట్ గ్రీవెన్స్ ఇచ్చిఉండాల్సిందని వెల్లడించారు. అధికారులు క్యాష్ అండ్ సీజీగా ఉత్తర్వులలో పేర్కొనడంతో దాని అర్థం మారిపోయి లైంగిక వేదింపులపై విచారణ అంటూ ప్రచారం జరిగిందని చెప్పారు. ఏఐఎస్ఎఫ్ తీవ్రంగా ఖండిస్తోందని, సోమవారం జరిగే విచారణలో నిజాలు నిగ్గు తేల్చి తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు దినేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో పెట్రోల్ కష్టాలు: డీజల్ తిప్పలు

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 25 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో వాహనదారులకు పెట్రోల్ కష్టాలు చోటు చేసుకున్నాయి. అలాగే చుట్టుపక్కల రైతులకు డీజల్ తిప్పలు చోటు చేసుకున్నాయి. రెండురోజులుగా పలు ఫిల్లింగ్ స్టేషన్లలో స్టాకు లేక నిర్మానుష్యంగా దర్శనమిస్తుంది. ఇక స్వామి అమ్మవార్ల సేవకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు తమ వాహనాలకు ఇంధనం లేక తిప్పలు పడుతున్నారు. హఠాత్తుగా చోటు చేసుకున్న ఈ సంఘటనతో వాహన దారుల్లో ఆందోళన చోటు చేసుకుంది.శ్రీకాళహస్తి పరిసరాల్లో 7 పెట్రోల్‌బంకులు ఉన్నాయి. ఇందులో పట్టణ నడిబొడ్డులో నాలుగు ఉన్నాయి. ఇవి ఎప్పుడూ రద్దీగా ఉంటాయి. అలాంటి బంకుల్లో కొన్నింటిలో డీజల్ లభించటం లేదు. మరి కొన్ని బంకుల్లో పవర్ పెట్రోల్ మాత్రమే లభిస్తుంది. దాంతో వాహన దారులు ముందుజాగ్రత్తగా ఎక్కడ స్టాకు ఉందో అక్కడకు పరుగులు తీస్తున్నారు. అయితే కొరత లేదని సరఫరాలో కొంత జాప్యం చోటు చేసుకుందని ఇది కృత్రిమ సమస్య అని వివరించారు.ఇక ఏ బంకుకు అయినా స్టాక్ వస్తే అది గంటల్లో పూర్తి అవుతుందన్నారు.ద్విచక్రవాహనాలకు సాధారణ పెట్రోల్‌ను వాడుతున్నారు. గతంలో పరిమితంగా ఉన్న ద్విచక్రవాహనాలు నేడు ఇఎంఐల మాయాజాలంలో ఇంటికి రెండు నుంచి నాలుగు ద్విచక్రవాహనాలు, కార్లు ఉంటున్నాయి. దాంతో పెట్రోల్ వాడకం పెరిగింది. దీనికి తగ్గట్టు బంకుల సంఖ్య పెరుగుతుంది.కృత్రిక కొరత ఒకటి రెండు రోజుల్లో పరిష్కారమౌతుందని చెబుతున్నారు.

## శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న ఆరవ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 25 ప్రభాతవార్త



తిరుపతిజిల్లా రైల్వేకోడూరు శాసనసభ్యుడు అరవ శ్రీనివాసులు శనివారం కుటుంబ సభ్యులతో వాయు లింగేశ్వరుని దర్శించుకు న్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి చైర్మెన్ సిసి శ్రీనాథ్‌లు వేదపండితులతో స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. ఆలయ ఇన్స్పెక్టర్లు వెంకటస్వామి, సుదర్శనం నాయుడు, ఏర్పాట్లు పర్యవేక్షించారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఆలయం తరఫున వారికి స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి అందించారు.

## ప్రతి శుక్రవారం డ్రై డే పాటించండి.!

### దోమకాటు నుండి రక్షణ పొందండి.!

### మండల హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మధుసూదన్‌రావు

చంద్రగిరి, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:



సమాజంలోని ప్రతి కుటుంబం శుక్రవారం రోజును డ్రై డే గా పాటించాలని మండల హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మధుసూదన్ రావు అన్నారు. స్థానిక రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్‌లో శనివారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. చెత్తకుప్పలు, నీటి నిల్వలు, పేడ దిబ్బలు, టైర్లు, కొబ్బరి చిప్పలు, డిస్పోజబుల్ కప్పులు వంటి వాటిని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. పరిశుభ్రత పాటించని పక్షంలో దోమల బెడద ఏర్పడి మలేరియా బారినపడే ప్రమాదం వుందన్నారు. ఆ మేరకు వైద్య సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డాక్టర్ ఐ.యుగంధర్ మాట్లాడుతూ సర్ రోనాల్డ్ రాస్ శాస్త్రవేత్త మలేరియాకు (దోమకాటు) మందు కనిపెట్టినట్లు తెలిపారు. దోమకాటు వలన అనేక రకాల జ్వరాలు వస్తున్నపటికీ మలేరియాలో ఒక రకమైనటువంటి పాలసీపరం అనేది ప్రమాదకరమనీ దీనికి వైద్యుల పర్యవేక్షణలో మందులు వినియోగించాల్సి వుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ దోమతెరను వినియోగించుకుని దోమకాటు నుండి రక్షణ పొందాలన్నారు. జ్వరంతో భాధపడే వ్యక్తులు నిర్లక్ష్యం చేయకుండా ముందుగా రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సౌమ్యప్రియ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ టాటాబాయి, పిహెచ్ఎన్ శ్యామల, సూపర్‌వైజర్లు నారాయణరాజు, తులసీరామ్, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## నీటిని సంరక్షిద్దాం..!

### పిఆర్ అడిషినల్ కమీషనర్ శివప్రసాద్

రామచంద్రాపురం, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:



నీటిని సంరక్షించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పంచాయతీ రాజ్ అడిషినల్ కమీషనర్ శివప్రసాద్ అన్నారు. శనివారం సి.రామాపురం ఎస్టీ కాలనీ సమీపంలోని కాలువలో జలధార, జలహారతి పథకం ద్వారా కాలువ పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో ముఖాముఖీ జరిపిన సంభాషణలో వారికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కూలీల మస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా వున్నందున ఉదయం పనులు త్వరగా ప్రారంభించి పూర్తి చేసుకుని వెళ్ళాలన్నారు. డిశంబర్ నుండి వేతనాలు బకాయిలు వున్నట్లు కూలీలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన 15 రోజుల్లోపు వేతనాలు బ్యాంకు ఖాతాలో జమచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి మద్దిలేటి, ఏపిడి చిన్నరెడ్డెప్ప, ఎంపిడిఓ పులి రాంజింగ్, ఏపిఓ సుజాత, జెఈ భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ-రోడ్ల సమస్యలకు పరిష్కారం దిశగా చర్యలు

తిరుపతి విద్య, ఏప్రిల్ 25 ప్రభాతవార్త



నగరంలోని 50వ డివిజన్‌లో మౌలిక వసతుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తూ ఎమ్మెల్యే ఆరాణి శ్రీనివాసులు పలు కీలక నిర్ణయాలు ప్రకటించారు. మూడు కాలనీల్లో సిసి రోడ్ల నిర్మాణానికి భూమిపూజలు నిర్వహించిన ఆయన, స్థానికులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలను కూడా ప్రాధాన్యంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.శ్రీనివాస నగర్‌లో రూ.23.20 లక్షలతో రోడ్డు, డ్రెయిన్ పనులు, పద్మావతి నగర్‌లో రూ.15 లక్షలతో సిసి రోడ్, పీవీ ప్రసాద్ నగర్‌లో రూ.27.50 లక్షలతో రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. అయితే పీవీ ప్రసాద్ నగర్ ప్రజలు ముందుగా డ్రైనేజీ సదుపాయం అవసరమని కోరగా, దీనిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకునేలా చూస్తామని ఎమ్మెల్యే తెలిపారు.నగరంలో పాత మౌలిక వసతుల సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటిని దశలవారీగా పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నామని ఆయన పేర్కొన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ కోసం రూ.280 కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు వెల్లడిస్తూ, అనుమతులు వచ్చిన వెంటనే అమలు చేస్తామని చెప్పారు.స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రజల సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో సుగుణమ్మ, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, బిజేపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్,నరేష్, మధులత, టిడిపి క్లస్టర్ ఇన్చార్జీ బిజి కృష్ణయాదవ్, రాజా రెడ్డి,వెంకటరత్నం, ఆదం సుధాకర్ రెడ్డి, సుధాకర్,వీరా, వూట్ల సురేంద్ర నాయుడు, భీమా, రమేష్ రెడ్డి, ఆళ్వార్ మురళీ, సుభాషిణి , శిరీషా, రామకృష్ణా,చరణ్ రాయల్, రమేష్ నాయుడు, వంశీ, తదితరలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చేత సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తిరుపతి విద్య, ఏప్రిల్ 25 ప్రభాతవార్త



పేదల వైద్య ఖర్చులకు ఉపశమనం కల్పించే సిఎంఆర్ఎఫ్ పథకం కింద లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆరాణి శ్రీనివాసులు శనివారం చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం ఏడుగురు లబ్ధిదారులకు రూ.7,72,601 విలువైన చెక్కులను అందజేశారు.చెక్కులు అందుకున్న వారిలో మధురానగర్‌కు చెందిన వెంకటేష్‌కు రూ.50,541, ఎఎంవి లతకు రూ.37,205, కుసుమకు రూ.2 లక్షలు, సుష్మితకు రూ.1,07,000, శంకర్ కాలనీకి చెందిన సుధాకర్ నాయుడుకు రూ.35,000, జీవకొన రాజీవ్ నగర్‌కు చెందిన జె.బాజీకి రూ.40,000 చొప్పున అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల వైద్య ఖర్చుల్లో ప్రభుత్వం భాగస్వామ్యం అవుతూ వారికి అండగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేదల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు పొనగంటి భాస్కర్, జనసేన నాయకుడు రాజా రెడ్డి, అంకాలమ్మ గుడి పాలక మండలి చైర్మన్ కొండా రాజ్ మోహన్, కెఎంకె లోకేష్, జీవన్, రాజేష్ ఆచారి, కొండా సానే శ్రీనివాస్, రమేష్ నాయుడు, ప్రభాకర్ రెడ్డి, వీర, శ్రావణ్, సాయిదేవ్ యాదవ్, మణి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థుల మధ్య ఘర్షణ..!

తిరుపతి విద్య, ఏప్రిల్ 25 ప్రభాత వార్త




స్థానిక ఎస్వీ ఆర్ట్స్ కళాశాల హాస్టల్లో ఉంటున్న విద్యార్థుల మధ్య ఘరణ జరిగింది. హాస్టల్ రూమ్లో ఫైనల్ ఇయర్ చదువుతున్న ఓ విద్యార్థి సెల్ఫోన్లో గంభీర స్వరంతో మట్లాడటంపై మరో విద్యార్థి ఆక్షేపిస్తూ అడ్డుకోవడంతో ఇరువురి మధ్య ఘర్షణ జరిగినట్లు తెలిసింది. చిన్న విషయాన్ని ఇరువురు తమ స్నేహితులో చెప్పుకోవడంతో రెండు వర్గాల ఏర్పడి ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నట్లు సమాచారం. హాస్టల్ అధికారులు ఇరువురితో చర్చించి సర్ధిచెప్పినా మరో వర్గం కళాశాల వెలుపల బయట వ్యక్తులతో మరో వర్గంపై దాడికి యత్నించినట్లు విద్యార్థులు చెబుతున్నారు. దీంతో ఇరువర్గాలు పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. ఈ ఘటన కళాశాలలకు సంబంధం లేదని బయట జరిగిన ఘటన అంటూ కళాశాల అధికారులు చెప్పుకొచ్చారు.

## నేడు బాబా ఆలయంలో సర్వసభ్య సమావేశం

పుత్తూరు రూరల్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని టీబీ రోడ్డులో వెలసిన శ్రీ షిరిడీసాయిబాబా ఆలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు సాయిబాబా నిత్య అన్నదాన సాంఘిక సేవా సమాజం వారు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం సాయి బంధువులకు ఉపహారం, స్వాగతం ప్రార్థన, శ్రద్ధాంజలి, ఉదయం 9.30 గంటలకు 2025-26 సంవత్సర అధ్యక్ష ఉపన్యాసం, 10 గంటలకు 2025-26 సంవత్సర వాస్తవ ఆదాయం, ఖర్చు బ్యాంకు నిల్వల సమర్పణ, 10.30 గంటలకు 2026-27 సవత్సర ఆదాయ ఖర్చు అంచనా బడ్జెట్, 11 గంటలకు కార్యవర్గ సమావేశం లోసమీక్ష అనంతరం తదితర కార్యక్రమాలపై సూచనలు, సలహాలు ఉంటాయని వివరించారు.

## నేడు శ్రీ సదాశివుని ఆలయంలో గ్రామ కూటమి

పుత్తూరు రూరల్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని కార్వేటినగరం రోడ్డులో వెలసిన శ్రీ కామాక్షి సమేత స్వామి ఆలయంలో ఈ నెల 26వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఆలయ ఆవరణలో గ్రామకూటమి నిర్వహిస్తున్నట్లు ఆలయఈవోజయకృష్ణ తెలిపారు.ఈసందర్భంగామే18వతేదీనుంచి28 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన గ్రామ కూటమిలో పలువురి సూచనలు, సలహాలు కోసం ఈ గ్రామ కూటమినిఏర్పాటుచేయడంజరిగింది. భక్తులందరూ కూటమిని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## బడి పిలుస్తోంది - ఇంటింటికి ప్రచార రథం

వడమాలపేట, ఏప్రిల్ 25 ప్రభాతవార్త



నాణ్యమైన విద్యకు చిరునామా ప్రభుత్వబడి అన్న నినాదంతో బడి బయట పిల్లలను బడిలో చేర్చడమే లక్ష్యంగా బడి పిలుస్తోంది కార్యక్రమంలో శనివారం వడమాలపేట మండలంలో నిర్వహించారు. వడమాలపేట నుంచి ప్రారంభించి మండలంలోని వడమాల, తడుకు ఆర్ఎస్, ఎస్వీ పురం, ఏఎం పురం, బట్టికండ్రిగ యానాది కాలనీ, బీసీకాలనీ, గంధపు హరిజనవాడ, పత్తి పుత్తూరు, కాయం, అప్పలాయగుంట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజల్లో చైతన్యం కల్పించడంలో మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు మండుటెండను సైతం లెక్కచేయకుండా ప్రచార రథం పైకెక్కి గొడుగులు వేసుకుని మరీ నిబద్ధతతో విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, సమగ్ర సదుపాయాలు, విద్యార్థుల అభివృద్ధికి లభిస్తున్న అవకాశాలపై అవగాహన కల్పించారు. ఏ పిల్లవాడూ బడి బయట ఉండకూడదనే స్పష్టమైన సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు ఉప విద్యాశాఖ అధికారి మహేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారులు పద్మావతి, తులసిరామ్, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వడమాలపేటలో ర్యాలీ

వడమాలపేట, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:




ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా వడమాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ సందీప్ మాట్లాడుతూ మలేరియా ఒక ప్రాణాంతక వ్యాధి, ఇది ప్లాస్మోడియం అనే పరాన్నజీవి వల్ల వస్తుంది. ఈ పరాన్నజీవిని ఆడ అనోఫిలిసన దోమలు కాటుతో మనిషికి వ్యాపిస్తుందని తెలిపారు. జ్వరం(తీవ్రంగా వస్తుందని), వణుకులు, తలనొప్పి, వాంతులు, అలసట ఈ లక్షణాలు ఉంటే వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలని తెలిపారు. డాక్టర్ వెన్నెల సాహితి మెడికల్ ఆఫీసర్ భానురేఖ, సీహెచ్ వోపురుషోత్తంరెడ్డి,మంజుల,సూపర్‌వైజర్లుమురళి,లలిత,ఏఎన్ఎంలు,ఆరోగ్యకార్యకర్తలు,ఆశలుపాల్గొన్నారు

## ప్రపంచ మలేరియా దినోత్సవం

నాగలాపురం, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:




ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భం గా, నాగలాపురం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు మలేరియా వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమాన్ని వైద్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ విజయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడు తూ మలేరియా వ్యాధి దోమల ద్వారా వ్యాపిస్తుందని, దోమల పెరుగుదలను నియంత్రించడం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చని తెలిపారు. ఇళ్ళ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకో వాలని, రాత్రిసమయంలో దోమ తెరలు ఉపయోగించాలని సూచించారు. అలాగే శుభ్రతను పాటించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. గ్రామాల్లోకి వెళ్లి ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. మలేరియా వంటి వ్యాధులను నివారించేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకో వాలని వైద్యులు పిలుపునిచ్చారు.ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలసిన బెల్ట్ రమేష్

సత్యవేడు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:



సత్యవేడు మండల వైసీపీ నాయకులు శనివారం తిరుపతిలోని రాష్ట్ర మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్, రాష్ట్ర కార్యదర్శి బీరేంద్రవర్మ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో సత్యవేడు మండల వైసీపీ కన్వీనర్ బాధ్యతలు ఇవ్వాలని సత్యవేడు వైసీపీ నాయకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. మాజీమంత్రి పెద్దిరెడ్డి వర్యులతో సత్యవేడు మండల అధ్యక్షుడు బాధ్యత బెల్ట్ రమేష్‌కు అవకాశం కల్పించవలసిందిగా అభ్యర్థించారు.సత్యవేడు మండల ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, సీనియర్ నాయకులు సురేష్, యుగంధర్, సెంథిల్, మస్తానమ్మ, స్టిఫాన్, శీను, చిరంజీవి, బీసీ కాలనీ కుమార్, పయణి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ఎస్‌సి ఫలితాలపై తప్పుడు ప్రచారం

### అధికారిక ప్రకటన లేదు

తిరుపతి విద్య, ఏప్రిల్ 25 ప్రభాతవార్త

జిల్లాలోని కొన్ని వాట్సాప్ గ్రూపులలో 10వ తరగతి (ఎస్ఎస్‌సి ) పబ్లిక్ పరీక్షల ఫలితాలు విడుదల అవుతున్నాయని తప్పుడు సమాచారం ప్రచారం అవుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సమాచారం పూర్తిగా అసత్యమని స్పష్టం చేశారు. ఇప్పటివరకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం నుంచి ఫలితాల విడుదల తేదీపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదని తెలిపారు. ఫలితాల తేదీని తగిన సమయంలో అధికారికంగా ప్రకటిస్తామని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో జిల్లాలోని ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు తమ పరిధిలోని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఈ విషయాన్ని వెంటనే తెలియజేయాలని ఆదేశించారు. తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని స్పష్టంగా సూచించాలని తెలిపారు.అదేవిధంగా డివిజన్‌ల వారీగా డి వై ఈ ఓ లు తమ పరిధిలోని వాట్సాప్ గ్రూపులను పర్యవేక్షి స్తూ, ఇటువంటి తప్పుడు ప్రచారం జరగకుండా గ్రూప్ అడ్మిన్లకు సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు. తప్పుడు సమాచారం వ్యాప్తి కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి అసత్య ప్రచారం చేసే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వార్త VAARTHA CLASSIFIEDS
CLASSIFIEDS
FOR SALE
★ PLOT FOR SALE IN ANJIMEDU NEAR KALAHASTI, READY TO CONSTRUCT BEAUTIFIL LOCATION
PH. 9515754146.
(Ro.No.2515)
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

# షార్‌లో స్వచ్ఛతా పక్షోత్సవం




శ్రీహరికోట, ఏప్రిల్ 25 ప్రభాతవార్త: భారత ప్రభుత్వం, అంతరిక్ష శాఖ ఆదేశాల మేరకు, డిఓఎస్ ఇస్రో కేంద్రాలు/ యూనిట్లలో స్వచ్ఛతా పక్షోత్సవం-2026ను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శాఖా క్యాంటీన్లు మరియు నివాస కాలనీలలో పరిశుభ్రతా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం, పారిశుధ్యం మరియు వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించడం, పరిశుభ్రత పట్ల పోటీతత్వాన్ని ప్రోత్సహించడం వంటి అంశాలపై దృష్టి సారిస్తున్నారు. దీనికి అనుగుణంగా, ఎస్ఎన్‌టి సిచీఫ్ జనరల్ మేనేజర్ ఎం.ప్రసాద్ అధ్యక్షతన షార్లో స్వచ్ఛతా పక్షోత్సవ అమలు విభాగాన్ని స్పీక్ ఏర్పాటు చేసింది. 2026 సంవత్సరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి స్పీక్ ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఈ కార్యక్రమంలో భాగంగా, కార్యాల యాలలో సామూహిక స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు మరియు ఉద్యోగుల కోసం వివిధ పోటీలు నిర్వహించారు. ప్రముఖ ప్రదేశాలలో బ్యానర్లను ప్రదర్శించారు, మరియు స్వచ్ఛతా థీమాటిక్ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదనంగా, బయోటాయిలెట్లు, శానిటరీ ప్యాడ్ వెండింగ్ మెషీన్లు, శానిటరీ ప్యాడ్ ఇన్సినరేటర్లను ఏర్పాటు చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టడానికి మరియు ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిరుత్సాహపరచడానికి కూడా ప్రయత్నాలు చేపట్టబడ్డాయి. ఈ నేపథ్యంలో, షార్ హౌసింగ్ కాలనీల లోని ఆయా కాలనీ వెల్ఫేర్ క్లబ్‌ల ద్వారా ప్లాగింగ్ రన్ నిర్వహించారు. ఈ పరిశుభ్రతా కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్తలు, ఉద్యోగులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులు చురుకుగా పాల్గొన్నారు. షార్కాలనీలో షార్ డైరెక్టర్ పద్మకుమార్ ఇ.ఎస్ పులికాట్ నగర్ కాలనీలో కంట్రోలర్ జి రమేష్ బాబు, స్వర్ణముఖి నగర్ కాలనీలో డిప్యూటీ డైరెక్టర్ జె దామోదరం, పినాకిని నగర్ కాలనీలో డిప్యూటీ డైరెక్టర్ పి. సునీల్ ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించారు. సీనియర్ అధికారులు అందరూ నివాస కాలనీలను పరిశుభ్రంగా, పచ్చగా ఉంచడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఏప్రిల్ 28 నుండి గ్రంథాలయంలో...

## వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 25 ప్రభాతవార్త : ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు పుస్తక పఠనానికి దూరమవుతున్న తరుణంలో, వారిలో మళ్ళీ పఠనాసక్తిని పెంపొందించడానికి, వారి మేధోశక్తిని పదును పెట్టడానికి స్థానిక శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు 2026 నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి ఎన్. శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఈ వేసవి శిబిరం ముఖ్య ఉద్దేశ్యం విద్యార్థులలో పుస్తక పఠనాన్ని ఒక అలవాటుగా మార్చడమే కాకుండా, వారిలో పదసంపదను పెంపొందించడం, వివిధ అంశాలపై సాధారణ జ్ఞానాన్ని పెంపొందించడం, శిక్షణ తరగతులలోని ముఖ్య పుస్తక పఠనం విశ్లేషణ కథల పుస్తకాలు, ప్రముఖుల జీవిత చరిత్రలు చదివించడం ద్వారా విద్యార్థులలో ఏకాగ్రతను పెంపొందించడం, పదాలను పరిచయం చేస్తూ, వాటి అర్థాలను, ప్రయోగాలను వివరించడం ద్వారా భాషా నైపుణ్యాన్ని పెంచడం, క్విజ్, వ్యాసరచన, వకృత్వ పోటీల నిర్వహణ ద్వారా సాధారణ జ్ఞానాన్ని పరీక్షించి, ప్రోత్సహించడం. భారతీయ పురాణాలు, నీతి కథల ద్వారా నైతిక విలువలను బోధించడం, చిత్రలేఖనం, చిన్న చిన్న కవితలు రాయడం వంటి అంశాలపై ఈ వేసవి శిక్షణ తరగతులు ఏప్రిల్ 28 నుండి ప్రారంభమై జూన్ 6వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 11.00 గంటల వరకు నిర్వహించబడతాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## దళితులపై దాడులు అమానుషం



పెళ్లకూరు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త: మండలంలోని అర్థమాల గ్రామంలో వరసగా జరుగుతున్న వివాదాలు కారణంగా ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. గత కొద్ది రోజులు ముందు జరిగిన అర్థమాల శంకరయ్యపై జరిగిన దాడి కేసులో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదులో ఇద్దరు వ్యక్తులు పేర్లు అర్థమాల హరినాథ్, వాటంబేటి. చంద్రశేఖర్ చెప్పగా వారిలో అర్థమాల హరినాథ్ ఒక్కరినే కేసులో చేర్చి చంద్రశేఖర్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చక పోవడంపై పెళ్లకూరు పోలీసులపై ఫిర్యాదుదారుడు జిల్లా పోలీసు ఉన్నతాధి కారులకు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం విధితమే. వరుసుగా అర్థమాల గ్రామంలోని దళితులపై జరుగుతున్న దాడులపై అర్థమాల గ్రామస్తులతో కలిసి దళిత నాయకులు యాగాని. బెన్నీ పెళ్లకూరులోని మండల కార్యాలయం వద్ద పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో యాగాని.బెన్నీ మాట్లాడుతూ అర్థమల గ్రామంలో వెనుకబడిన వర్గానికి చెందిన కొంతమంది అధికార పార్టీ నాయకులు దళితులపై దాడులు చేస్తూ వారిలో ఒకరిపై ఒకరికి విద్వేషాలు సృష్టిస్తున్నారన్నారు. ఈ విషయంలో సుళ్లరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, అధికార పార్టీ మండల అధ్యక్షులు సంచి. కృష్ణయ్య స్పందించి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



చిట్టమూరు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త: ప్రస్తుత వాతావరణ ప్రతికూల పరిస్థితులు నేపథ్యంలో ఉన్న దాతకు అన్ని విధాల ప్రకృతి వ్యవసాయమే శ్రేయస్కరమని చిట్టమూరు మండల వ్యవసాయ అధికారి నిరంజన్ కుమార్ తెలియ జేశారు. రైతు సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో చిట్టమూరు మండలంలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారి నిరంజన్ కుమార్‌తో పాటు అన్ని రైతు సేవ కేంద్రాల వ్యవసాయ సహాయకులు, ప్రకృతి విభాగ సిబ్బంది పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయంతో రైతుకు ఎంతో శ్రేష్కరమని తద్వారా పర్యావరణ కాలుష్యాన్ని వివరించడంతోపాటు పుడమి తల్లి ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులతో పాటు ఆర్‌ఎస్కే సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బాబాసాహెబ్, ధనమ్మ, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

## పోలేరమ్మ జాతరకు ప్రవీణ్‌కు ఆహ్వానం



నాయుడుపేట, ఏప్రిల్ 25 ప్రభాతవార్త: పట్టణంలో మే నెల 5,6 తేదీల్లో జరుగునున్న గ్రామదేవత శ్రీపోలేరమ్మ జాతర మహోత్సవంలో పాల్గొని అమ్మ వారి ఆశీస్సులు అందుకోవాలని కోరుతూ జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్, నాయు డుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కు శ్రీ పోలే రమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు కమిటీ సభ్యులతో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. శనివారం శ్రీపోలేరమ్మ ఆలయ కమిటీ వారు ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆలయ సంప్రదాయాల మేరకు తాంబూలంతో పాటు ఆహ్వాన పత్రికను ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు మాట్లాడుతూ అంగరంగ వైభవంగా నిర్వహించనున్న శ్రీ పోలేరమ్మ జాతరలో పాల్గొని, జాతరను విజయవంతం చేసి అమ్మవారి ఆశీస్సులు అందుకోవాలని ఉయ్యాల ప్రవీణ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నిత్యా కృష్ణారెడ్డి, వినుకొండ ధనుంజయ, బాలు శెట్టి, మురళి తదితరులు ఉన్నారు.

# మహిళలకు ఉచిత బస్సు సిఎం కల్పించిన హక్కు

**- ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్**



కుప్పం, ఏప్రిల్ 25 ప్రభాతవార్త: స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సిఎం చంద్రబాబునాయుడు కల్పించిన హక్కు అని అది ఆర్టీసీ అధికారులో, ఉద్యోగుల దయాదాక్షిణ్యాలతో కాదని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం కుప్పం ఆర్టీసీ డిపోలో ఆత్మీయసమ్మేళన సభ కార్యక్రమంకు ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడాఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు హాజరయ్యారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడారు. కడ సభ్యురాలు అయిన సుగుణమ్మ తన గమ్యస్థానం వద్ద బస్సు ఆపాలని కోరితే అక్కడ ఆపకుండా స్మశానం వద్ద ఆర్టీసీ డ్రైవర్ ఆపారని ఒక మహిళా నేతకే ఇలా జరిగితే సామాన్య మహిళల పరిస్థితి ఏ ంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటివారిని డూ ్యటీ నుంచి రిమూవ్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజలు కట్టే పన్నులతో జీతాలు వస్తున్నాయనే విషయం మరువరాదని పేర్కొన్నారు. కుప్పం ఆర్టీసీ డిపోలో మార్పుకు శ్రీకారం చుట్టాలని రీజనల్ మేనేజర్ రాముకు సూచించారు. డిపోలో ఉన్న ఆన్‌కాల్ డ్రైవర్లకు శిక్షణ ఇప్పించాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్యపర అంశాలపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. యూనియన్లు కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందేలా బాధ్యత వహించాలన్నారు. ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థకు ఉద్యోగులు మంచి పేరు తేవాలని సూచించారు. సిఎం చంద్రబాబు ఆదేశాలతో త్వరలోనే 75కోట్లతో ఆధునిక బస్‌స్టేషన్, డిపో నిర్మాణంకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎం రాము,ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, కార్పోరేషన్ డైరెక్టర్ వేణు, రెస్కో డైరెక్టర్ ఆర్ముగం, కౌన్సిలర్లు జాకీర్, ఎంఆర్ సురేష్, మాజీ సర్పంచ్ ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుభాషను కాపాడుకుందాం : ఎమ్మెల్యే




పలమనేరు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త: కన్నతల్లి లాంటి తెలుగుభాషను కాపాడుకుందామని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. స్థానిక సాయినగర్‌లో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ పరభాషా వ్యామోహంలో తెలుగు భాషను మరువవద్దని పూర్వవైభవం తీసుకు రావడానికి అందరూ సమన్వ యంతో కృషి చేయాలని సూచించారు. అన్ని ప్రాంతాల్లోనూ ప్రాంతీయ గ్రంథాలయాలను బలోపేతం చేసుకోవాలని తెలుగుబాషా పరిరక్షణను ఈ తరం యువత కొనసాగించాలని సూచించారు. ముఖ్య అతిధిగా విచ్చేసి జాతీయ సభకు అధ్యక్షత వహించిన అవనిగడ్డ ఎమ్మెల్యే తెలుగుభాషా సంఘం పూర్వ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మాతృభాష మనుడగకు ప్రభుత్వ సహకారం, ప్రజల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ప్రపంచం గర్వించే రచనలు తెలుగులో ఎన్నో వచ్చాయని తెలుగుబాషా సాహిత్యాలతో పాటు అనువాద సాహిత్యం కూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రముఖ రచయిత డా.జి.వి.పూర్ణచంద్ తెలుగు సాహిత్య వికాసానికి తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసినాథం నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వమంచి వికాసానికి మంచి పుస్తకాలు ఉపయోగపడతాయని అందుకే నీతి పుస్తకాలు లక్షలాది సంఖ్యలో ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. కట్టమంచి బాలక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో ఎంతో మంది అద్భుతమైన కవులు రచయితలు అనువాదకులు ఉన్నారని తెలిపారు. పెద్దపంజాణి ఎంపిడిఓ పలమనేరు బాలాజీ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే మంచిపుస్తకాలు చదవడం ద్వారా విద్యార్థులకు మంచి వ్యక్తిత్వం అలవాటు అవుతుందన్నారు. గంటామోహన్, ధనంజయ, రామక్రిష్ణప్ప, మంచికంటి వెంకటేశ్వరరెడ్డి, అవినేని భాస్కర్, జొన్న విత్తుల శ్రీరామచంద్రమూర్తి, ఎంఆర్ అరుణకుమారి, తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా నుండి రచయితలు, కవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై దేవేరులతో శ్రీనివాసుడు



చంద్రగిరి, ఏప్రిల్ 25 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీనివాసుడు తన దేవేరులతో తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి భక్తులు నారికేళ కర్పూర నీరాజనాలర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్‌బాబు, అర్చకులు కళ్యాణ్ సుందరం, జమేధర్ కుమార్, తదితరులు పాల్గొ న్నారు.

## ఉపరాష్ట్రపతి కోసం ముందస్తు భద్రతపై సమీక్ష



రేణిగుంట, ఏప్రిల్ 25 ప్రభాతవార్త: భారత ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్ ఈనెల 27,28 వ తేదీలలో తిరుమల తిరుపతి పర్యటన నిమిత్తం జిల్లా ఉన్నతాధికారులు శనివారం రేణిగుంట విమానాశ్రయం నందు ముందస్తు భద్రత సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. విమానాశ్రయం నుండి ఆయన ప్రయాణించే మార్గంలో కట్టుదిట్టమైన భద్రత చేపడుతున్నారు. రోడ్డుకిరు వైపులా పోలీసులను మోహరింపజేస్తున్నారు. రహదారిలో ఉన్న తూములు, కల్వర్టుల వద్ద డాగ్, బాంబ్ స్క్వాడ్లతో తనిఖీలు చేపట్టారు. ఆయన ప్రయాణ మార్గంలో రవాణా ప్రోటోకాల్ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. వాహన శ్రేణిలో అగ్నిమాపక యంత్ర వాహనాలు, అంబులెన్సులు ఉండాలని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు. అవసరమైన గ్రూపు రక్తాలు, మందులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎయిర్పోర్ట్ విమానాశ్రయ విఐపి లాంచ్‌లో అన్ని రకాల వసతులు ఏర్పాటు చేయాలని విమానాశ్రయ అధికారులను కోరారు. ఉపరాష్ట్రపతి పర్యటనలో ఏమాత్రం అలసత్వం వహించిన చర్యలు కఠినంగా ఉంటాయి హెచ్చరించారు. ముందస్తు భద్రతా సమావేశంలో ఎయిర్పోర్ట్ డైరెక్టర్ భూమి నాదన్, ఇంటలిజెన్స్ అధికారి నాగబాబు, అడిషనల్ ఎస్పీలు రవి మనోహరాచారి, శ్రీనివాసరావు, నాగ భూషణరావు, వెంకటరాముడు, డిఆర్ఓ నరసింహులు, జిల్లా రవాణా శాఖ అధికారి మురళీమోహన్, డి ఎంహెచ్ ఓ బాలకృష్ణ నాయక్, డీఎస్ఓ రాజు, డీఎఫ్ఓ రమణయ్య, ఇంటెలిజెన్స్ అధికారి నాగబాబు, శ్రీకాళహస్తి ఆర్డిఓ భాను ప్రకాశ్ రెడ్డి, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, సిఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అనురాగ్ యాదవ్, ఐబీ అధికారి శిరీష, డీఎస్పీలు రామకృష్ణ చారి, చంద్రశేఖర్, భక్తవత్సలం, రామకృష్ణ, చిరంజీవి, ప్రసాద్, రాంబాబు,అంకారావు, వెంకటనారాయణ, రేణిగుంట తహసిల్దార్ శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు..

## జనగణనపై నేడు ర్యాలీ

తిరుపతి,ఏప్రిల్ 25ప్రభాతవార్త: రాబోయే జనగణన కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆదివారం (నేడు)ఉదయం 6 గంటలకు 5కే రన్ (అవగాహన ర్యాలీ) నిర్వహించనున్నారు. ఈ 5కే రన్ స్థానిక వెంకటేశ్వర వైద్యకళాశాల వివేకానంద సర్కిల్ నుండి ప్రారంభమై, ఎస్వీ యూనివర్సిటీ వరకు కొనసాగుతుంది. జనగణన ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడం మరియు అందరి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, ప్రభుత్వ ఉద్యోగులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాము. 5కే రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న వారికి మొదటి, రెండో, మూడో స్థానాలు సాధించిన వారికి నగదు బహుమతులు ఇవ్వనున్నారు.

## అరకొర పార్కింగ్ స్థలాలతో అవస్థలు



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** సాధారణ రోజుల్లోనే తిరుమలకు వచ్చిన వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయాలనేది భక్తులకు తలనొప్పి వ్యవహారంగా మారింది. ఇక వేసవి సెలవులు, భారీగా పెరిగిన రద్దీతో వాహనాల పార్కింగ్ సమస్య వెంటాడుతోంది. కొండపై సుమారుగా నాలుగువేల వరకు వాహనాలు పార్కింగ్‌కు అవకాశం ఉంది. ఆపై వాహనాల సంఖ్య పెరిగితే ప్రధానంగా వరాహస్వామి విశ్రాంతి గృహాలు, పద్మావతి విచారణ కార్యాలయం, ఎంబిసి,వైకుంఠమ్ 2 ప్రాంతాల్లో రోడ్లపైనే భక్తులు వాహనాలను పార్కింగ్ చేయడం జరుగుతుంది. రోజువారీగా తిరుమ లకు ఐదారువేలవరకు నాలుగుచక్రవాహనాలు వస్తున్నాయనేది టిటిడి విజిలెన్స్, తిరుమల పోలీసుల సమాచారం. ఇలా వస్తున్న వారిలో అధికశాతం మంది భక్తులు తమిళనాడు, కర్నాటక, తెలుగురాష్ట్రాలు, మహారాష్ట్ర, ఒరిస్సా, కేరళ రాష్ట్రాల నుండి యాత్రికులు పుణ్యక్షేత్రాల సందర్శనపేరుతో తిరుమలకు చేరుకుంటున్నారు. తిరుమలలో ఏటిసి కార్‌పార్కింగ్, ముళ్ళగుంట, పాపవినాశనమ్ మార్గంలో, పాత డిటైప్ ప్రాంతం, కౌస్తుభం ,బాలాజీనగర్ ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు ఉన్నాయి. ఇక ఏదేని ప్రత్యేక పర్వదినాలు, బ్రహ్మోత్సవాలు వంటి సమయాల్లో అదనంగా తాత్కాలిక పార్కింగ్ స్థలాలు గుర్తించి వాహనాలను పార్కింగ్ చేయించడం జరుగుతుంది. సిఆర్ఒ, పద్మావతి విచారణ కార్యాలయం, ఎంబిసి ప్రాంతాల్లో రోడ్లపైనే వాహనాలను ఆపి వెళుతున్నారు. భక్తుల వాహనాలను ఎక్కడబడితే అక్కడ ఇబ్బదిముబ్బడిగా ఆపి దర్శనానికి వెళుతుండటంతో నియంత్రణ చాలా కష్టంగా మారింది.

**-"మల్టీలెవల్" పార్కింగ్ ప్రతిపాదనలేవీ!:**

యాత్రికుల సంఖ్యతోబాటు వాహనాలు కూడా పెరిగిపోతున్నాయి.దీంతో సరైన పార్కింగ్ స్థలాలు లేక ట్రాఫిక్ ఇబ్బందులు భక్తులకు తప్పడంలేదు. మరీ వారాంతంలో ఈ రద్దీ మరింతగా పెరిగి వాహనాలు ఎక్కువగానే వస్తున్నాయి. ట్రాఫిక్ కష్టాలు తొలగడానికి మల్టీలెవల్ కార్ పార్కింగ్ శరణ్యమనేది గతంలోనే ఇంజనీరింగ్ అధికారులు టిటిడి ఉన్నతాధికారులకు ప్రతిపాదించారు.

# సూళ్లూరుపేట డివిజన్

## వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు



నాయుడుపేట, ఏప్రిల్ 25 ప్రభాతవార్త: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న పాఠశాల యాజమాన్యలపై కఠిన చర్యలు తీసుకోవాలిని ఏబీవిపి రాష్ట్ర ఎస్ఎఫ్‌డి కో కన్వీనర్ తడుకు చందు అన్నారు. నాయుడుపేట మండలంలో అ ఖిల భారతీయ విదార్థి పరిషత్ నాయుడుపేట శాఖ ఆధ్వర్యంలో స్థానిక విద్యాశాఖ అధికారి కె.మాధవి లతా కళ్యాణికి వినతిపత్రం శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ప్రాంత ఎస్ఎఫ్‌డి కో-కన్వీనర్ తడుకు చందు మాట్లాడుతూ నాయుడుపేటలో ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో వేసవి సెలవు దినాలలో, స్పెషల్ క్లాసుల పేరిట తరగతులు యధావిధిగా నిర్వహిస్తున్నారని రాష్ట్ర ఎస్ఎఫ్ కో-కన్వీనర్ తడుకు చందు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు నుంచి సెలవులు ప్రకటించినప్పటికి జిల్లాలో ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాల వారు ప్రభుత్వ నిబంధనలను గాలికి వదిలేసి ఏమాత్రం భయం లేకుండా స్పెషల్ క్లాసులు పేరిట తరగతులు నిర్వహిస్తూ ఉన్నారని,ఒక వైపు విపరీతమైన ఎండలతో ప్రజలు అల్లాడుతుంటే పాఠశాల యాజమాన్యాలు ఏమీ తెలియనట్టుగా విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారిపై విద్యాశాఖ అధికారి చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. అలాగే నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లు అక్రమంగా పుస్తకాలు విక్రయాలు చేస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు మాత్రం ఏమి పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. లేని యెడల అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తీవ్ర స్థాయిలో ఆందోళన చేపడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ఆరీష్, రక్షక్, సాయి, ఇంద్రసేనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు ఇంటర్వ్యూలు

బాలాయపల్లి, ఏప్రిల్ 25 ప్రభాతవార్త: వెంకటగిరి కార్యాలయ పరిధిలోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని 3 మండలాలు వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల పరిధిలో ఈ నెల 6వ తేది నుండి 18వ తేది వరకు వెంకటగిరి కార్యాలయం నందు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని సిడిపిఒ షంషాద్ బేగం తెలిపారు. వీరికి ఈ నెల 29వ తేది ఉదయం శ్రీకాళహస్తి నందు రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరు కావల్సిందిగా ఆమె తెలిపారు. అభ్యర్థులు తీసుకుని రావలసిన సర్టిఫికెట్స్ ఒరిజినల్, జిరాక్స్, విద్యార్హతలు, పుట్టిన తేదీ, వయస్సు ధృవీకరణ తహసీల్దార్ వారి ద్వారా చేయబడిన కులము, నివాస ధృవీకరణ పత్రం ఇంటర్వ్యూ కాల్ లెటర్, ఇతర అర్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లు అభ్యర్థి చేసుకున్న దరఖాస్తు, రసీదు వారి వెంట తప్పక తీసుకురావాలని ఆమె తెలిపారు.

## రూ 25 కోట్లతో జెట్టి నిర్మాణానికి మంజూరు

**- స్థలాన్ని పరిశీలించిన రాష్ట్ర మెరైన్ ఐజి గోపీనాథ్ జెట్టి**



వాకాడు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త: మండలం పూడి రాయి దొరువు గ్రామంలోని శనివారం మత్స్యకారులకు 25 కోట్ల రూపాయలతో జెట్టి నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని రాష్ట్ర మెరైన్ ఐజి గోపీనాథ్ జెట్టి పరిశీలించారు. స్థానిక రెవెన్యూ శాఖ అధికారులతో జెట్టి నిర్మాణానికి సంబంధించిన అనువైన స్థలాన్ని గోపీనాథ్ జెట్టి పాటు స్థానిక డిఎస్పి చెంచు బాబు, సిఐ మాల కొండయ్య, రెవెన్యూ ఇన్స్పెక్టర్ అఖిల్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి జిరఘు, వీఆర్వో శ్రీనివాసులు, దుగ్గరాజపట్నం మెరైన్ సిబ్బంది, సాగర మిత్రాలు ప్రసన్నకుమార్, శ్రీనివాసులు, వెంకటరమణ, స్థానిక నేతలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి ఐసిఆర్‌పిలు, విఏఏలకు శిక్షణ కార్యక్రమం



వాకాడు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త: మండలం కొండపురం ఆర్ఎస్‌కెలో ఆర్‌వైఎస్ఎస్ అగ్రికల్చర్ వారి ఆధ్వర్యంలో మండల లెవల్ ట్రైనింగ్ వ్యవసాయాధికారి దీప ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ట్రైనింగ్ ఐసిఆర్‌పిలు, విఏఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా వాకాడు మండలం వ్యవసాయాధికారి దీప మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈఎల్ నినో ప్రభావం వలన వాతావరణంలో అనేక మార్పులు వస్తున్నాయని, అధిక ఉష్ణోగ్రతలు, అధిక వర్షపాతం నమోదు అవుతున్నాయని, దీనిని అధిగమించాలంటే ప్రకృతి వ్యవసాయం ద్వారానే సాధ్యం అవుతుందని తెలియజేసారు. అధిక ఉష్ణోగ్రతను తగ్గించాలంటే భూమికి 365 రోజులు ఆ పచ్చని పంటలతో కప్పి ఉంచాలని, దీనికి పిఎండిఎస్ (నవధాన్యాలు) భూమిలో చల్లడం ప్రధానమని తెలియ జేయడం జరిగింది. కషాయాలు మరియు ద్రవ, ఘన జీవామృతం గురించి తెలియజేసారు. భూమికి రైతులను ప్రకృతి వ్యవసాయ దారులుగా మార్చడానికి డిఆర్‌పి, హాఫ్ మూన్ మాడల్ పై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఫీల్డ్‌లో ఏటిఎం మోడల్‌ను పరిశీలించారు. ఈ రెండు రోజులు ట్రైనింగ్‌కు ఐసిఆర్‌పిలు, విఏఏలు, ఎఫ్ఎంటిలు రాంబాబు, పద్మ, అనంతయ్య, రైతులు పాల్గొన్నారు.

## విష పురుగు కుట్టి వ్యక్తి మృతి!



శ్రీకాళహస్తి రూరల్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:శ్రీకాళహస్తి మండలంలోని గుంటక్రిందపల్లికి చెందిన కె.రామిరెడ్డి(45) అనే రైతుకు విష పురుగు కుట్టి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఊరందూరు ఎస్టీకాలనీలోని పొలం పనులు చేస్తూ ఉండగా విషపురుగు కుట్టిందన్నారు. దీని తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

## అక్రమ గ్రానైట్ క్వారీలపై పోలీసుల మెరుపు దాడి

**- రెండు హిటాచీ వాహనాలు.. లారీ సీజ్ !!**




కుప్పం, ఏప్రిల్ 25 ప్రభాతవార్త : కుప్పం ప్రాంతంలో అక్రమ గ్రానైట్ క్వారీలపై కుప్పం పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. మండలంలోని గుట్టపల్లి కాలనీ సమీపంలో అక్రమంగా నిర్వహిస్తున్న రెండు అక్రమ గ్రానైట్ క్వారీలపై డిఎస్పీ పార్థసారథి, అర్బన్ సిఐ శంకరయ్య సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న 30 దాకా గ్రానైట్ బ్లాక్‌లను స్వాధీనం చేసుకుని మైనింగ్ అధికారులకు అప్పగించారు. అలాగే క్వారీల వద్ద గ్రానైట్ రవాణాకోసం ఉన్న ఓ లారీని రెండు హిటాచీ వాహనాలను సీజ్ చేశారు. ఈసందర్భంగా డిఎస్పీ మీడియా సమావేశంలో మాట్లాడారు. గ్రానైట్, బియ్యం, ఇసుక అక్రమ రవాణాలు చేయరాదని ఇదివరకే హెచ్చరించామన్నారు. అయితే కొంతమంది అక్రమార్కులు తమ అక్రమ దందాలను కొనసాగిస్తున్నారన్నారు. ప్రజలు అందిస్తున్న సమాచారం మేరకు తాము అక్రమ క్వారీలపై దాడులు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. సహకరిస్తున్న ప్రజలకు అభినంది ంచారు. కుప్పం నియోజకవర్గంలో అక్రమ మైనింగ్‌కు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు.

## ప్రసన్న వెంకటేశ్వరునికి తిరుచ్చి వాహన సేవ



వడమాలపేట, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:అప్పలాయగుంటలో అభయహస్తంతో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారికి శనివారం ఊంజల్‌సేవ వైభవ ంగా జరిగింది. వేకువ జామున సుప్రభాతసేవలో స్వామివారిని మేల్కొలిపి అర్చకులు నిత్యకైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఉభయదేవేరులతో పాటు స్వామివారి ఉత్సవ మూర్తులను ఊయాలలో కొలువుదీర్చగా గంటపాటు సిద్వీలాసంగా ఊయలలూగుతూ స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన స్వామివారు మాడా వీధుల్లో విహరించారు. భక్తులు ధూపదీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారి వేణుగోపాల్, అర్చకులు రమణాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.



## రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్ చైర్మన్‌కు ఘన సన్మానం

రేణిగుంట ఏప్రిల్ 25 ప్రభాతవార్త




రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్ చైర్మన్ దేవ సహాయంను రేణిగుంటకు సి ఆర్ యస్ విశ్రాంత ఉద్యోగి పిడబ్ల్యూఎ సిఆర్ఎస్ ఏఐఆర్ఆర్ఎఫ్ బ్రాంచ్ కార్యదర్శి విజయ్ కుమార్ బెంగళూరులో ఆయన స్వీయ పరిపాలన భవనంలో కలిసి ఘనంగా సత్కరించారు. రేణిగుంట (తిరుపతి) రైల్వే క్యారేజ్ రిపేర్ వర్క్ షాప్ చీఫ్ మేనేజర్ గా విధులు నిర్వహించి ప్రమోషన్ పై ఆయన బెంగుళూరుకు ఆర్ఆర్బీ చైర్మన్ గా బదిలీ అయ్యారు. సి ఆర్ ఎస్ కు జాతీయస్థాయిలో గుర్తింపు రావడానికి దేవ సహాయం అనేక విధాల కృషి చేశారని విజయకుమార్ తెలిపారు. ఆయనను కలిసి సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఆయన ఇంకా ఎన్నో ప్రమోషన్లు పొంది ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షి ంచారు. ఆయనతోపాటు బ్రాంచ్ వైస్ చైర్మన్ అబ్దుల్ అబ్దుల్ మజీద్ సత్కరించిన వారిలో ఉన్నారు

## మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

### -53 మద్యం సీసాలు స్వాధీనం...

రేణిగుంట ఏప్రిల్ 25 ప్రభాతవార్త

రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని జీపాలెం నందు తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు రూరల్ సీఐ మంజునాథరెడ్డి పర్యవేక్షణలో గాజులమండ్యం ఎస్సై హరీష తమ సిబ్బందితో శుక్రవారం రాత్రి ఆకస్మికంగా దాడులు నిర్వహించింది. ఈ దాడులలో అక్రమంగా మద్యం అమ్ముతున్న సుమతి (53) ను అదుపులోకి తీసుకున్నారు. ఆమె నుండి దాదాపు 53 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మహిళపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. గంజాయి, మద్యం, నిషేధిత పొగాకు ఉత్పత్తులు అమ్మినా, కొన్నా, సరఫరా చేసిన కేసులు నమోదు చేస్తామని తెలిపారు. పోలీసు ఉన్నతాధికారులు ఈ విషయంపై నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

## నీలిసానిపేటలో పోలీసుల నిర్బంధ తనిఖీలు ..

### 27 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

..రేణిగుంట ఏప్రిల్ 25 ప్రభాతవార్త



రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ పరిధిలో తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, డీఎస్పీ శ్రీనివాసరావు సూచనలతో శనివారం ఉదయం నీలిసాని పేటను రేణిగుంట సబ్ డివిజన్ పోలీసులంతా ఒక్కసారిగా చుట్టుముట్టి నిర్బంధించారు. గ్రామస్తులకు ఏం జరుగుతుందో అర్థం కాలేదు. నీలిసానిపేటలోని ఇంటింటిని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. డ్రోన్ల సహాయంతో గగన తలం నుండి పరిశీలించారు. తనిఖీల్లో రికార్డులు లేని 27 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆగంతకుల సంచారంపై ఆరా తీశారు. ఆ ప్రాంతం చుట్టూ కర్మాగారాలు ఉండడంవల్ల అందరి ఆధార్ కార్డును నిశితంగా చెక్ చేశారు. ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. రేణిగుంట శ్రీవారి ముఖద్వారం కావడం, దగ్గర్లో రైల్వే జంక్షన్, అంతర్జాతీయ విమానాశ్రయాలు ఉండడంవల్ల ప్రతిరోజు శ్రీవారి దర్శనానికి వీఐపీ, భక్తుల రాకపోకలు అధికంగా ఉన్నాయని ఆగంతకుల వల్ల వారికి ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున ఎవరైనా కొత్తవారు కనిపిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబరు 112 కు కాల్ చేయాలన్నారు. అనుమానాస్పదంగా కనిపించిన ఆరుగురు వ్యక్తుల వేలిముద్రలు సేకరించారు. తనిఖీలు నిర్వహించిన వారిలో రూరల్ సీఐ మంజునాథరెడ్డి, గాజులమండ్యం ఎస్సై హరీష, ఏర్పేడు ఎస్సైలు శ్రీకాంత్ రెడ్డి, రవి , సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

రేణిగుంట, ఏప్రిల్ 25 ప్రభాతవార్త



రేణిగుంట మండలం అన్నాసంపల్లె రేణిగుంట రోడ్డు నందు మణికంఠ లేఅవుట్ వద్ద ఆటో బోల్తా పడిన ప్రమాదంలో గాయపడిన షేక్ మొహమ్మద్ అలీ, (52) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అర్బన్ పోలీసుల ఇచ్చిన వివరాలు మేరకు గురువారం సాయంత్రం షేక్ మొహమ్మద్ అలీ ఆటోలో ప్రయాణిస్తుండగా ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని 108 అంబులెన్స్ నందు తిరుపతి రుయా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం పంపారు. రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుని కుమార్తె కరిష్మా శనివారం ఇచ్చిన ఫిర్యాదు తో రేణిగుంట అర్బన్ పోలీసులు సిఐ జయచంద్ర ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ రాగే మద్దిలేటి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## చేప చర్మంతో కాలిన గాయాలకు చికిత్స

### - సర్జరీ విభాగాచార్యులు డాక్టర్ ఆర్వి. సురేష్ కుమార్

తిరుపతి హెల్త్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త




ఎస్వి వైద్య కళాశాల, ఎస్వి వెటర్నరీ విశ్వవిద్యాలయం పశువైద్యశాల, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, సంయుక్తంగా నిర్వహించిన పరిశోధనలలో తేలిన నిజమని శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం సర్జరీ విభాగం ఆచార్యులు డాక్టర్ ఆర్వి సురేష్ కుమార్ పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో మంది నిరుపేదలు కాలిన గాయాలతో తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తము వస్తూ ఉంటారన్నారు. కాలిపోయిన చర్మాన్ని పునరుత్పత్తి చేయు వైద్యం చాలా ఖర్చుతో కూడింది. అది అందుబాటులో లేక ఎంత మంది ఈ వైద్యానికి దూరం అవుతున్నారు. చర్మ మార్పిడి రోగి యొక్క చర్మం నుండి కానీ, వేరొక దాత శరీరం నుండి గానీ తీసి వేసే ఆ వైద్యాన్ని స్కిన్ గ్రాఫ్టింగ్ అని అంటారు. ఈ ప్రక్రియ ఎంతో ఖర్చుతో కాక శరీరానికి ఎంతో బాధతో, నొప్పితో కూడుకున్నదన్నారు. దీనికి ప్రత్యామ్నాయం గురించి ప్రముఖ శస్త్ర చికిత్స వైద్యురాలు డా. రోజా రమణి, పరిశోధన మొదలు పెట్టారన్నారు. భారతీయ చరిత్రలో మన పూర్వీకులు 2000, 3000 సంవత్సరాల క్రితమే, చేప చర్మంతో ఈ వైద్యం మొదలు పెట్టారు,అయితే అది కనుమరుగైపోయిందన్నారు. దీన్ని మనము అధునాతన పరిశోధన వైద్య పద్ధతులతో పరిశోధనలు నిర్వహించి, మన దేశ వాలి చేప చర్మంతో చర్మ మార్పిడి పద్ధతులను పరిశోధించి రోగికి అందించాలని ఈ యొక్క పరిశోధనలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డాక్టర్ రోజా రమణి, ఎస్ వి వైద్య కళాశాల, రుయా ఆసుపత్రి సర్జరీ ప్రొఫెసర్, శ్రీ వేంకటేశ్వర పశు వైద్యశాల శస్త్రచికిత్ర ఆచార్యులు డా. ఆర్వి సురేష్ , శ్రీ పద్మావతి మహిళ విశ్వ విద్యాలయం చెందిన డా .ఏ.విద్యా ప్రతి ఈ పరిశోధనలను దిగ్విజయంగా నిర్వహించుకుంటూ వస్తున్నారు. ఇందులోని ప్రచురించిన పత్రాలను ఐసి.ఎం.ఆర్ న్యూఢిల్లీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారికి పంపిన పిదప, ఉత్తమమైన పరిశోధన పత్రాలు సెలెక్ట్ చేసుకున్నారని వారికి పరిశోధన పత్రాలుకు ఆమోదం లభించిందన్నారు. డాక్టర్ విద్యావతి మహిళా విశ్వవిద్యాలయం ఫార్మసీ విభాగం నుండి, ఈ చేప చర్మాన్ని శుద్ధి పరచి, చూర్ణము చేసి, డ్రాఫ్ట్ చర్మమును కాలిన గాయాలు పై ఉపయోగించేలా తయారు చేశారు. ఈ చేప చర్మంపై చేసే పరిశోధనలను ఘనంగా పురోగతి చెందుతున్నది. ఈ ప్రయోగాన్ని జంతువులపై, పరిశోధనలు నిర్వహించి, పురోగతి చెందిన తర్వాత, ఈ ప్రయోగ ఫలితం ఆధారముగా మనుషులలో కూడా ఉపయోగించి, ఆ పరిశోధనలను మన తిరుపతి రుయా అనపత్రి శస్త్ర చికిత్స విభాగం నందు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పరిశోధనలకు గుర్తింపు రావడానికి కారణమైన అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ జి. రవిప్రభు, రుయా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ బి మనోహర్, ఎస్వి వైద్య కళాశాల పూర్వ కళాశాలాధ్యక్షులు డా. ఎమ్మెస్ శ్రీధర్, పూర్వ ప్రిన్సిపాల్స్ ఎన్వి. రమణయ్య, డా. సి. జయభాస్కర్, డా. చంద్రశేఖరన్, బహుళ పరిశోధనా సంస్థ వారికి కృతజ్ఞతలు తెలిపారు. వైద్య పరిశోధనలు ఇంకా జరగాలని ప్రోత్సహిస్తున్న డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్ పూర్తి, సహాయ సహకారాలు అందిస్తున్నారు, ఈ కార్యక్రమంలో ఎస్ వి వైద్య కళాశాల బహుళ పరిశోధన సంస్థ నోడల్ అధికారి డాక్టర్ ఏఎస్ కిరీటి, డాక్టర్ రోజారమణి, పరిశోధకులు వి.మధుసూదన్, ఎస్ వి వైద్య కళాశాల పిఆర్ఓ వీర కిరణ్ తదుతరులు పాల్గొన్నారు.

## మోనికకు అభినందనలు

### టిడిపి సీనియర్ నాయకులు గాలి మురళి నాయుడు

తొట్టంబేడు ఏప్రిల్ 25 ప్రభాతవార్త



మండలంలోని గుండేలగుంట గ్రామానికి చెందిన వన్నెకాపు చెంచురెడ్డి, నాగమ్మ దంపతుల కుమార్తె వి.మోనిక శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ జూనియర్ ఇంటర్ సీఈసీ గ్రూప్ నందు 500 మార్కులకు గాను 483 మార్కులు సంపాదించింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ మండల అధ్యక్షుడుగాలి మురళినాయుడు మోనిక ను దుశ్శాలవతో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచి ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించడం చాలా ఆనందకరమని కొనియాడారు. ఉన్నతమైన కోర్సులు ఎన్నుకొని మంచి మార్కులు సాధించి మంచి ఉద్యోగం చేయాలని ఆయన ప్రోత్సహించారు. అదేవిధంగా తల్లిదండ్రులకు, గ్రామానికి, మండలానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన తెలిపారు.

## ఆగని విద్యుత్ మోటార్ల చోరీ

ఏర్పేడు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త



ఏర్పేడు మండలంలో మళ్ళీ విద్యుత్ మోటార్లు,స్టార్టర్లు చోరీ ప్రారంభమైంది. వ్యవసాయక ప్రాధాన్యత కల్గిన శ్రీకాళహస్తి,ఏర్పేడు మండలాల్లో విద్యుత్ మోటార్లు స్టార్టర్లు అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి జాతీయ రహదారి పక్కన ఉన్న మేర్లపాక గ్రామంలో దొంగలు పడ్డారు. ఒకే సారి గంప గుత్తగా కత్తిరిస్తున్నారు. దొంగలు పగలు రెక్కి జరిపి రాత్రి చోరీలకు పాల్పడుతున్నట్లు సంఘటనలను బట్టి తెలుస్తుంది. మేర్లపాక గ్రామంలో ఒకటి రెండు కాదు. ఒకే సారి 30 మోటార్ల వద్ద గల కేబుల్‌తో పాటు స్టార్టర్లు దొంగలించారు. అయితే ఈ సంఘటనకు సంబంధించి పోలీసులకు ఫిర్యాదులు అందలేదని పోలీసులు తెలిపారు. ఈ ప్రాంతాల్లో వ్యవసాయం బోర్లు మీద ఆధారపడి సాగుతుంది. బోర్లు ఉన్న రైతులు మెట్టపంటలుగా వేరుశెనగ పండించటం ఆనవాయితి. ఈ సీజన్‌లో మోటార్లు, కేబుల్స్ చోరీ జరగటంలో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

## నేడు బ్రహ్మంగారి ఆరాధన

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 25 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని విశ్వబ్రాహ్మణ సంఘం తరపున ఆదివారం వీరబ్రహ్మంగారి ఆరాధనా మహోత్సవాలు నిర్వహించుటకు సన్నాహాలు జరుగుతున్నాయని సంఘానికి చెందిన కన్వీనర్ చంద్రాచారి, బి.రేణుకాదేవి శనివారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయానికి సమీపంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ధార్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేసామన్నారు. ఆలయంలోని స్వామి వద్దజీవసమాధి ఆరాధనోత్సవాలు మధ్యాహ్నం 12.30గంటలకు జరుగుతుందని ఆయన వివరించారు. భక్తుల విశేష సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు.

## మలేరియాను తరుముదాం: ఆరోగ్యంగా ఉందాం

### డాక్టర్ బాలు

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 25 ప్రభాతవార్త




మలేరియా రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు సహకరించాలని శ్రీరామ్‌నగర్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్‌బాలు అన్నారు. శనివారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఆయన సెంటర్‌లో సిబ్బందితో సమావేశం జరిపారు. తరువాత అవగాహన ర్యాలి ఏర్పాటు చేసారు. మలేరియా సోకకుండా సోకిన తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించి అవగాహన ర్యాలి నిర్వహించారు. మలేరియా లక్షణాలను వివరిస్తూ ఇది ఒక ప్రాణాంతక వ్యాధిగా తెలిపారు. ఈ వ్యాధి సోకకుండా ఉండాలంటే దోమల ఉత్పత్తిని అరికట్టాలన్నారు. ఎక్కడా నీరు నిల్వ కుండా చూడటం నీటి ట్యాంకులకు మూత పెట్టడం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాత టైర్లు, బక్కెట్లు, కుండలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. రాత్రి సమయంలో దోమ తెరలను వాడాలని సూచించారు. అలాగే ఇళ్ళలో దోమల ఉత్పత్తిని అరికట్టుటకు కాయిల్స్ లిక్విడ్‌లను వాడాలని డాక్టర్ బాలు సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## జిల్లా దేశం కమిటిలో శ్రీకాళహస్తికి అవకాశం

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 25 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంటరీ జిల్లా కమిటీలో శ్రీకాళహస్తికి చెందిన పలువురికి అవకాశం దక్కింది. శ్రీకాళహస్తిలోని పలువురికి అవకాశం దక్కగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలుగుదేశం పార్టీ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ నేపథ్యంలో అవకాశం దక్కిన వారిలో శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు జిల్లా ఉపాధ్యక్షుడుగా అవకాశం వచ్చింది. ఇక ఇతర పదవుల్లోజిల్లా ఉపాధ్యక్షురాలుగా లోకేశ్వరి, జిల్లా అధికార ప్రతినిధిగా మాజీ కౌన్సిలర్ వి.అనిత, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా గాలి కృష్ణవేణిజిల్లా కార్యదర్శిగా ఎం.వెంకటసుబ్బయ్యలకు అవకాశం దక్కిందని పార్టీ అధిష్ఠాన వర్గం కమిటిలో శ్రీకాళహస్తికి చెందిన పలువురికి అవకాశం కల్పించటం అభినందనీయం అని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అభినందించారు. పార్టీ కోసం పాటు పడుతున్న, పడిన వారికి తప్పక తెలుగుదేశం పార్టీలో అవకాశం ఉంటుందని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

## శివయ్య సేవలో డిసిఎం ఓయస్‌డి

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 25 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం సాయంత్రం డెప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఓయస్‌డి మధుసూధన్ స్వామి అమ్మవార్ల దర్శనానికి వచ్చారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్దఇఓ బికె వెంకటేశులు, చైర్మెన్ కొట్టు సాయి ప్రసాద్ వేదపండితులతో ఘనస్వాగతం పలికారు. ఆయన ఆలయంలో నిర్వహించే పలు ధార్మిక కార్యక్రమాల్లో ఓ సామాన్యభక్తునిలా పాల్గొన్నారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఆయన ఆలయంలో నిర్వహించిన చిన్న కొటాయ్ ఉత్సవంలో పాల్గొన్నారు. అలంకరా మండపంలో స్వామి అమ్మవార్లను ముస్తాబు చేసిన అధికారులు,అర్చకులు ఆలయ ప్రాకరంలో ఉత్సవానికి తరలించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్ల పల్లకిలను ఓయస్‌డి మధుసూధన మోసారు. ఈ కార్యక్రమాల్లో చైర్మెన్ కొట్టుసాయి ప్రసాద్‌తో పాటు ఇఓ బికె వవెంకటేశులు ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి భక్తులతో పాటు పల్లకిని మోసుకుంటూ పొగడమాను వద్దకు చేర్చారు. అక్కడ నిర్వహించిన అభిషేకాలు, అలంకారాల్లో పాల్గొన్నారు. ఏర్పాట్లును ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు వెంకటస్వామి, సుదర్శనం నాయుడు పర్యవేక్షించారు.

# తిరుపతి డివిజన్

## శ్రీకాళహస్తిలో పోలిసెట్ పరీక్షలు

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 25 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలో శనివారం పాలిసెట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. వివిధ డిప్లొమా కోర్సుల ప్రవేశం కోసం నిర్వహించే పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలు చక్కటి ఏర్పాట్లు బందోబస్తు మధ్య జరిగాయి. శ్రీకాళహస్తిలో మొదటి సారి ఈ పోటీ పరీక్షలకు శ్రీకాచం చుట్టారు. రెండు కేంద్రాలను ఏర్పాటు చేసారు. ప్రతి సారి తిరుపతి వెళ్లి విద్యార్థులు పరీక్షలు రాసే వారు. ఈ ఏడాది ఈ పరీక్షలకు 503 మంది విద్యార్థులు పరీక్షలు రాసి నట్టు నిర్వాహాకులు వెంకటయ్య తెలిపారు. శ్రీకాళహస్తిలోని పానగల్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోనూ, కొత్తపేటలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో రాత కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెంకటయ్య వివరించారు. పరీక్షలంటే రాసే వారి కంటే వారి తల్లిదండ్రుల్లో ఆందోళన, ఉత్సాహం కనబడుతుంది. శనివారం ఒక గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఉదయం 11 గంటలకు పరీక్షలంటే విద్యార్థులు వారి తల్లిదండ్రులు 9గంటలనుంచే చేరుకోవటం కనబడింది. ఇక పరీక్షల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా మంచినీటి సరఫరా, గాలి వెలుతురు బాగా సోకేటట్లు ఏర్పాట్లు చేసారు. ఇక పోలీసులు చక్కటి బందోబస్తును ఏర్పాటు చేసారు. వన్‌టౌన్ సిఐ ప్రకాష్‌కుమార్ పలుమార్లు పరీక్షా కేంద్రాల వద్ద పర్యవేక్షించారు. పోలీసులు విద్యార్థులు పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్ళకుండా జాగ్రత్త పడ్డారు.

## శివయ్య సేవలో చీపురుపల్లి ఎంఎల్ఏ

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 25 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయులింగేశ్వరుని శనివారం చీపురుపల్లి ఎంఎల్ఏ మాజీ టిటిడి చైర్మెన్ కిమిడి కళా వెంకట్రావు కుటుంబసభ్యులతో కలసి దర్శించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి, గోపినాథ్‌లు వేదపండితులతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. వాకచర్ల గుర్రప్పశెట్టి స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

## మాజీ శాసనసభ్యుని సత్కరించిన వ్యాపారి

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 25 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి ఎస్‌డికె నగర్‌లో మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డిని ప్రముఖ జ్యూవలరి వ్యాపారి ఆరవింద్‌జైన్ దంపతులు సత్కరించారు. అరవింద్ దంపతులు నూతనంగా ఇల్లు నిర్మించుకున్నారు. ఆ ఇంటి గృహప్రవేశానికి ముఖ్యఅతిధిగా మధుసూధనరెడ్డి పలువురు నాయకులతో హాజరయ్యారు. వారికి అనంద్‌జైన్ దంపతులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మధుసూధనరెడ్డి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయనను జైన్ దంపతులు దుశ్శాలువతో సత్కరించారు. ఆయనతో పాటు మైనారిటి నాయకుడు పఠాన్ ఫరీద్‌ఖాన్, ఈ ప్రాంతానికి చెందిన కార్యకర్త డి.బాబు, మాజీ కౌన్సిలర్ కంఠా ఉదయ్‌కుమార్, గఫూర్, కొట్టె శరవణ సురేష్ తదితరులున్నారు.

## పల్లంపేటలో ప్రమాదకరంగా విద్యుత్తు లైన్లు..

### కొత్త ఇండ్లుపై వెళుతున్న 11 కెవి లైన్.., పట్టించుకోని అధికారులు..

ఏర్పేడు ఏప్రిల్ 25 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం పల్లం పంచాయతీ పల్లంపేట వద్ద కొత్త ఇండ్ల పైన 11 కెవి లైను ప్రమాదకరంగా వెళుతుంది. ఈ లెవెన్ కె.వి లైన్ ను మార్చాలని పలు దఫాలు గ్రామస్తులు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించారు. అయినా అధికారంలో స్పందన కరువైందని ఈ సమస్యను పరిష్కరించాలని శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని గ్రామస్తులు వాపోగా స్పందించిన ఆయన సంబంధిత డివిజన్ విద్యుత్ శాఖ అధికారికి, లెటర్ రాసి వెంటనే పల్లంపేట వద్ద కొత్త ఇండ్లుపై ప్రమాదకరంగా వెళ్తున్న 11 కెవి వైర్లను వెంటనే మార్చాలని ఆదేశించారు. ఎమ్మెల్యే లెటర్ ఇచ్చి చెప్పినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ఈ విద్యుత్ లైన్లో కరెంట్ సరఫరా జరుగుతూ ఉంటుందని ఎవరికైనా ఏదైనా ప్రమాదం జరిగితే తప్ప అధికారులు స్పందించరా అని గ్రామస్తులు వాపోతున్నారు. జిల్లా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి పల్లంపేటలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు లైనులను వెంటనే తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు..

## సబ్ జైలు ఆకస్మిక తనిఖీ...

శ్రీకాళహస్తి ఏప్రిల్ 25 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి సబ్‌జైలును శనివారం జూనియర్ సివిల్ జడ్జ్ కృష్ణప్రియ అకస్మికంగా తనిఖీ చేశారు. 12వ అదనపు జిల్లా జడ్జ్ ఆదేశాల మేరకు సబ్ జైల్లోని స్టోర్ రూమ్‌ను, సబ్ జైలు పరిసరప్రాంతాలను బాత్రూంలను, ముద్దాయిలు నివసిస్తున్న ప్రదేశాలను పరిశీలించారు. పరిశుభ్రతపై ఆరా తీశారు, అనంతరం ముద్దాయిలతో మాట్లాడి వారి సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రత మరియు చట్టాలపైఅవగాహన కల్పించి, వారికి ఏ సమస్య ఉన్న అర్జీ రూపంలో అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, సబ్ జైల్ సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

